మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 20-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 291 Issue: 291

20 ఏప్రిల్ 2026 - సోమవారంశ్రీ పరాభవ నామ సంవత్సరంఉత్తరాయణం - వసంత ఋతువువైశాఖ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - ఉ. 6:00సూర్యాస్తమయం - సా. 6:29తిథితదియ ఉ. 7:28 వరకుతరువాత పంచమిసంస్కృత వారంఇందు వాసరఃనక్షత్రంరోహిణి రా. 2:080 వరకుతరువాత మృగశిరయోగంసౌభాగ్య సా. 4:12 వరకుకరణంగర ఉ. 7:28 వరకువనిజ సా. 5:52 వరకువర్జ్యంసా. 6:57 నుండి రా. 8:23 వరకుదుర్ముహూర్తంమ. 12:39 నుండి మ. 1:29 వరకుమ. 3:09 నుండి మ. 3:59 వరకురాహుకాలంఉ. 7:34 నుండి ఉ. 9:07 వరకుయమగండంఉ. 10:41 నుండి మ. 12:15 వరకుగుళికాకాలంమ. 1:48 నుండి మ. 3:22 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:24 నుండి తె. 5:12 వరకుఅమృత ఘడియలు రా. 11:15 నుండి రా. 12:41 వరకుఅభిజిత్ ముహూర్తంఉ. 11:50 నుండి మ. 12:40 వరకుగమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana




## అక్షయ తృతీయ వ్యాపారం..
# రూ.20,000 కోట్లు

### గతేడాదితో పోలిస్తే పెరిగిన పసిడి, వెండి ధరలు.. డిజిటల్ గోల్డ్, గోల్డ్ బాండ్ల వైపు పెరిగిన ఆసక్తి

బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నా అక్షయ తృతీయ నాడు పసిడి కొనుగోలు చేయాలనే సెంటిమెంట్ ఏమాత్రం తగ్గలేదు. ఈ ఏడాది అక్షయ తృతీయ సందర్భంగా దేశవ్యాప్తంగా బంగారం, వెండి అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ పర్వదినాన సుమారు రూ. 20,000 కోట్ల విలువైన వ్యాపారం జరిగినట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ తెలిపింది.

ముంబై: గతేడాది ఇదే రోజున జరిగిన రూ. 16,000 కోట్ల వ్యాపారంతో పోలిస్తే ఇది 25 శాతం అధికం కావడం గమనార్హం. గతేడాది 10 గ్రాముల బంగారం ధర సుమారు లక్ష రూపాయలు ఉండగా, -2 వ పేజీలో...



## రాళ్లు.. టపటపా!

### హైదరాబాద్‌లో వడగండ్ల వాన

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. సికింద్రాబాద్ బోయిన్ పల్లి పరిసర ప్రాంతాలలో వడగళ్ల వర్షం -2 వ పేజీలో...


# జీవితాలు పటాకులు

## బాణసంచా పరిశ్రమలో పేలుడు, 23 మంది మృతి

### తమిళనాడులోని విరుధునగర్‌లో ఘోర విషాదం

### దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్

### సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం



తమిళనాడులో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విరుధునగర్ జిల్లా, కట్టనార్‌పట్టిలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ దుర్ఘటనలో 23 మంది కార్మికులు మరణించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

చెన్నై: ఈ దుర్ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కట్టనార్‌పట్టి బాణసం చా ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటనంలో పలువురు మరణించారన్న వార్త తీవ్ర వేదనకు గురిచేసింది" అని స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ తరువాయి 2 వ పేజీలో...

• అందాలలో.. అహో మహోదయం



## మిస్ ఇండియా-2026గా సాధ్వి సతీశ్

భువనేశ్వర్: మిస్ ఇండియా 2026గా గోవాకు చెందిన సాధ్వి సతీశ్ సెయిల్ కిరీటాన్ని ముద్దాడారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన సుందరీమణులను వెనక్కి నెట్టి, అందం, తెలివితేటలతో సాధ్వి నెంబర్ వన్‌గా నిలిచారు. శనివారం రాత్రి ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ వేదికగా జరిగిన 61వ మిస్ ఇండియా పోటీల్లో అందాల భామలు మెరిసిపోయారు. 'పుత్రికాభిమానం'అనే గొప్ప థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుకలో గత ఏడాది విజేత నికితా పోర్వాల్.. సాధ్వికి మిస్ ఇండియా కిరీటాన్ని అలంకరించారు. సాధ్వి సిల్వర్, బ్లాక్ కలర్ గౌనులో దేవకన్యలా మెరిసిపోయారు. మహారాష్ట్రకు చెందిన రాజనందిని పవార్ ఫస్ట్ రన్నరప్‌గా నిలిచి 'మోడ్రన్ ప్రిన్సెస్' అనిపించుకున్నారు. సెకండ్ రన్నరప్‌గా శ్రీ అద్వైత గోల్డ్ కలర్ గౌనులో తళతళలాడారు. 2027లో జరగబోయే 'మిస్ వరల్డ్' పోటీల్లో భారతదేశం తరపున సాధ్వి ప్రాతినిధ్యం వహించబోతున్నారు.

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,420 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,201 |



# కారు రూటు జగిత్యాలకు!

## నేడే కేసీఆర్ ప్రజాశీర్వాద సభ

### బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి చేరిక.. రహదారులు, కూడళ్లు గులాబీమయం

తెలంగాణ ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు.

జగిత్యాల, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంన గర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. 'జగిత్యాల నుంచే బీఆర్ఎస్ పూర్వ వైభవానికి నాంది పడనుంది' అని కేటీఆర్ పేర్కొన్న నేపథ్యంలో ఈ సభకు ప్రాధాన్యం సంతరిం చుకుంది. ఇప్పటికే సభా స్థలిని పరిశీలించిన కేటీఆర్, హరీశ్ రావు, కొప్పుల ఈశ్వర్ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ రూటు కాళేశ్వరానికి..!

### మధ్యాహ్నం 3 గంటలకు స్వామి దర్శనం

### అనంతరం మేడిగడ్డ బరాజ్ సందర్శన

### నస్తూర్‌పల్లి బహిరంగ సభకు హాజరు

సీఎం రేవంత్ రెడ్డి సోమవారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కాళేశ్వరం చేరుకోనున్న సీఎం రేవంత్.. ముందుగా కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారు.

భూపాలపల్లి, ఏప్రిల్ 19 (ఈవార్తలు): అక్కడి నుంచి సాయంత్రం 4:20కి మేడిగడ్డకు చేరుకోనున్న సీఎం.. మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శిస్తారు. అక్కడే ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి.. ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులపై చర్చిస్తారు. ఆ తరువాత కాటారం మండలం నస్తూర్‌పల్లిలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్న సీఎం రేవంత్.. రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారు. తన పర్యటనలో సీఎం రేవంత్.. కేసీఆర్, బీఆర్ఎస్ టార్గెట్‌గా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంలోనే గులాబీ బాస్‌ను రేవంత్ టార్గెట్ చేయొచ్చనే చర్చ జరుగుతోంది. రేవంత్ సభ నేపథ్యంలో ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు.. డీసీసీ అధ్యక్షుడు కరుణాకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



93 కిలోమీటర్ల మేర ఏసీతో కూడిన అర్బన్ హైవేను నిర్మించేందుకు దుబాయ్ సర్కారు ప్లాన్ చేస్తోంది. ఈ రహదారిపై పాదాచారులు, సైక్లిస్టులు, బైకర్లు మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది.




# మళ్లీ పార్లమెంటుకు మహిళా బిల్లు!?

## మరోసారి అన్ని పార్టీలతో చర్చల దిశగా యోచన

### జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్ల అమలు

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాతే రిజర్వేషన్లు తరువాయి 2 వ పేజీలో...

# అమెరికాలో 8 మంది పిల్లలు మృతి

### లూసియానాలో సాయుధుడి కాల్పులు

న్యూయార్క్: అమెరికాలోని లూసియానాలో ఓ రద్దీ ప్రదేశంలో సాయుధుడు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది పిల్లలు మృతి చెందారు. మృతుల వయసు ఒకటి నుంచి 14 ఏళ్ల మధ్య ఉంటుందని ష్రీవ్‌పాట్ అధికారులు వెల్లడించారు. దాడుల అనంతరం నిందితుడు ఓ కారును తస్కరించి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ -2 వ పేజీలో...





# ఇటలీలో ఇద్దరు భారతీయుల మృతి

### గురుద్వారా బయట కాల్పులు..

### నిందితుడూ ఇండియనే!?

రోమ్: ఇటలీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వైశాఖి పండుగ వేడుకల సందర్భంగా ప్రార్థనల కోసం గురుద్వారాకు వచ్చిన ఇద్దరు భారతీయులను దుండగుడు కాల్చి చంపాడు. బెర్గామో ప్రావిన్స్‌లోని కోవో పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
20.4.2026

మేషం: బంధువులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. దైవదర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభనలు కలుగుతాయి. వృధా ఖర్చులు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోక పోవడం మంచిది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది.

వృషభం: నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. దూర ప్రాంత మిత్రుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో గౌరవ మర్యాదలుకు లోటు ఉండదు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

మిధునం: స్థిరాస్తి కొనుగోలు అవరోధాలు తొలగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. నూతన వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి.

కర్కాటకం: ధన పరంగా ఒడిదుడుకులు ఉంటాయి. దూర ప్రయాణాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించలేక అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది.

సింహం: దూర ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు. వృత్తి వ్యాపారాలలో ఊహించని ఇబ్బందులు కలుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కన్య: పాత మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన విద్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

తుల: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కుటుంబ సభ్యులు సలహాలు కొన్ని విషయాల్లో కలిసి వస్తాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు సఫలమవుతాయి. స్థిరాస్తి సంభందిత క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగమున ఉన్నతి కలుగుతుంది.

వృశ్చికం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. కుటుంబ పెద్దల అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ధన పరంగా తొందరపడి ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. ఉద్యోగమున సమస్యలు కలుగుతాయి.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. అకారణంగా బంధువులతో వివాదాలు కలుగుతాయి. కొన్ని వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. కొందరి మాటల వలన మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపారాలలో భాగస్వాములతో మాటపట్టింపులు ఉంటాయి. నిరుద్యోగులకు అధిక శ్రమతో కాని ఫలితం అందదు.

మకరం: బంధుమిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. గృహమున వివాహాది శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వాహన భూ లాభాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో పెట్టుబడులకు తగిన లాభాలు అందుకుంటారు.

కుంభం: చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభన కలుగుతుంది. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. శ్రమతో కూడిన దూరప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో ఊహించని విభేదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి.

మీనం: దాయాదులతో స్థిరాస్తి వివాదాల పరిష్కారం అవుతాయి. శుభకార్యాల కొరకు ధనం ఖర్చు చేస్తారు. సంఘంలో పెద్దల ఆదరణ పెరుగుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు అధిగమిస్తారు.

# మళ్లీ పార్లమెంటుకు మహిళా బిల్లు!?

మొదటి పేజీ తరువాయి

అమలవుతాయని చెప్పడంపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో, ఈ అడ్డంకులను అధిగమించేందుకు కేంద్రం కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ బిల్లు అమలుకు సంబంధించి ఏకాభిప్రాయం సాధించేందుకు, త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలతో మరోసారి విస్తృత స్థాయి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, అందరినీ కలుపుకొని పోవాలని యోచిస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియపై నెలకొన్న గందరగోళాన్ని నివారించేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. అయితే, జనాభా లెక్కల సేకరణ పూర్తయితేనే డీలిమిటేషన్ చేపట్టడం సాధ్యమవుతుంది. అందుకే, ముందుగా సెన్సస్ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాతే రిజర్వేషన్ల అమలు దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా మహిళా ఓటర్ల మద్దతును కూడగట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మరోవైపు, డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అవసరమైన సాంకేతిక మార్పులతో బిల్లును తిరిగి పార్లమెంటులో ప్రవేశపెట్టే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు సమాచారం.






## అక్షయ తృతీయ వ్యాపారం.. రూ.20,000 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం అది రూ. 1.58 లక్షలకు చేరింది. వెండి ధర కూడా కిలోకు రూ. 85,000 నుంచి ఏకంగా రూ. 2.55 లక్షలకు ఎగబాకింది. ఈ భారీ ధరల పెరుగుదల వినియోగదారుల కొనుగోలు సరళిపై స్పష్టమైన ప్రభావాన్ని చూపింది. ప్రజలు భారీ ఆభరణాలకు బదులుగా తక్కువ బరువున్న (లైట్‌వెయిట్), నిత్యం ధరించేందుకు వీలైన నగల వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. ధరలు పెరగడంతో వ్యాపారం విలువ పరంగా పెరిగినట్లు కనిపిస్తున్నా, విక్రయించిన బంగారం పరిమాణం (వాల్యూమ్) తగ్గిందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈసారి దేశవ్యాప్తంగా సుమారు 10-20 టన్నులబంగారం, 157 టన్నుల వెండి అమ్ముడైనట్లు అంచనా. మరోవైపు, భౌతిక బంగారానికి బదులుగా డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు కూడా ప్రజలు ఆసక్తి కనబర్చారు.



## జీవితాలు పటాకులు

మొదటి పేజీ తరువాయి

చేశారు. కాగా, ఈ కర్మాగారంలోని 10కి పైగా గదులు ఉన్నాయి. వాటిలో సుమారు 30 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ రోజు సెలవు దినం అయినప్పటికీ, ఫ్యాక్టరీ ముందు భాగంలోని వరాండాలో బాణసంచా తయారీ, ముడి పదార్థాల నిర్వహణ పనులు చేపట్టారు. ఈ క్రమంలోనే ముడి పదార్థాలు ఒకదానికొకటి రాపిడికి గురై ఒక్కసారిగా మంటలు అంటుకున్నట్లు ప్రాథమిక సమాచారం. దీనితో క్షణాల వ్యవధిలోనే మంటలు ఫ్యాక్టరీ అంతటా వేగంగా వ్యాపించి భారీ పేలుడు సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఘటనలో 23 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

మరో ఆరుగురు తీవ్ర గాయాలతో విరుదునగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని సమాచారం. దీనివల్ల మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కాగా, ప్రమాదం జరిగిన తర్వాత ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక, సహాయక దళాలు సహాయక చర్యలు చేపట్టాయి. రెస్క్యూ ఆపరేషన్ పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.



## రాళ్లు.. టపటపా!

మొదటి పేజీ తరువాయి

కురిసింది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని వివిధ ప్రాంతాలు, కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్‌టీయూ , నిజాంపేట్, కేపీహెచ్‌బీకాలనీ, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం అకస్మాత్తుగా రాళ్లు పడ్డాయి. వేడి వాతావరణం కొన సాగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీ వర్షం కురిసింది. కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో సాయంత్రం పూట ప్రజలు స్వాంతన పొందారు.



## కారు రూటు జగిత్యాలకు!

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సభకు వచ్చే సామాన్య ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాయకులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా తాగునీరు ఇబ్బంది రాకుండా భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. మూడు లక్షల వాటర్ బాటిల్లు సభా ప్రాంగణం వద్ద అందుబాటులో ఉంచనున్నారు. దీంతోపాటు ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగేందుకు రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. సభా ప్రాంగణంలో భారీ కూలర్లతో పాటు ఫ్యాన్లను కూడా ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి వేలాది వాహనాల్లో ప్రజలు తరలివచ్చే అవకాశాలు ఉండడంతో పోలీసులతో పాటు పార్టీ వలంటీర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు. వివిధ రూట్ల నుంచి వచ్చే బస్సులతోపాటు కార్లు, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేకమైన పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పట్టణంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సైన్ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. భారీ బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు ఇప్పటికే ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాల నిఘాతో పాటు మఫ్టీల్లో ఉన్న పోలీసులు నిరంతరం పహారా కాస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

## అమెరికాలో 8 మంది పిల్లలు మృతి

మొదటి పేజీ తరువాయి

క్రమంలో కాల్పులు జరపగా నిందితుడు చనిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాల్పులకు గురైన వారిలో కొందరు నిందితుడికి బంధువులని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అయోవా యూనివర్సిటీ సమీపంలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆదివారం తెల్లవారుజామున స్థానికంగా విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరు కాల్పులు జరపగా.. ముగ్గురు విద్యార్థులు గాయపడినట్లు తెలిసింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## ఇటలీలో ఇద్దరు భారతీయుల మృతి

మొదటి పేజీ తరువాయి

ఈ విషాదం జరిగింది. ప్రార్థనలు ముగించుకుని గురుద్వారా నుంచి బయటకు వస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. మృతులను కోవో పట్టణ నివాసి రగిందర్ సింగ్ (48), సమీపంలోని అగ్నడెల్లోకు చెందిన గుర్మీత్ సింగ్ (48)గా గుర్తించారు. గురుద్వారా ముందున్న స్క్వేర్ వద్దకు వచ్చిన ఓ ఆగంతకుడు, వారిపై కాల్పులు జరిపి కారులో పరారైనట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఘటనా స్థలం నుంచి పోలీసులు సుమారు 10 బుల్లెట్ కేసింగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇది ఆకస్మిక ఘర్షణ కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన హత్య అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కాల్పులు జరిపిన వ్యక్తి కూడా గురుద్వారాకు తరచూ వచ్చే ఓ భారతీయుడేనని ఒక ప్రత్యక్ష సాక్షి తెలిపినట్లు సమాచారం. ఈ దాడిలో బుల్లెట్లు తగలడంతో మూడో వ్యక్తికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈ హత్యలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రేవంత్ రూటుకాళేశ్వరానికి..!



శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మేడిగడ్డను సందర్శించి ప్రాజెక్టులోని లోపాలను ప్రజలకు వివరించనున్నార ని తెలిపారు. నస్తూరుపల్లిలో జరిగే సభకు సుమారు లక్షమంది హాజరవుతారని అంచనా వేశామని పేర్కొన్నారు. సభలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ కావ్య తదితరులు పాల్గొంటారని చెప్పారు. రైతు భరోసా నిధులను సభ వేదికగా విడుదల చేసి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి చేరుతుండటాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండిపడ్డారు. తుమ్మిడి హెట్టి వద్ద డ్యామ్ నిర్మించాలని నిపుణులు సూచించినప్పటికీ, కేసీఆర్ నిర్ణయంతో మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మించారని ఆరోపించారు. రూ.35 వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన పనులను డిజైన్ మార్చి దాదాపు లక్ష కోట్లకు పెంచి మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుల డిజైన్ మార్చి రైతులకు అన్యాయం చేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు నీతి మాటలు మాట్లాడుతున్నారు అని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం రైతాంగానికి న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. చివరిగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కవిత పార్టీలోకి క్యూ



### జాగృతిలో చేరిన రాథోడ్ బాపూరావు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత .. తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. ఈనెల 25వ తేదీన తన కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసిన కవిత.. దానికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకుంటున్నారు. ఇప్పటికే కాశీ, అయోధ్య పర్యటన పూర్తి చేసుకున్న కవిత.. కొత్త పార్టీ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే తాను పెట్టనున్న పార్టీలోకి రావాలని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసిన ఉద్యమకారులు, మాజీ మావోయిస్టులు, యువత, మేధావులకు ఇప్పటికే కవిత విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా బోథ్ మాజీ ఎమ్మెల్యే.. కాంగ్రెస్ నేత రాథోడ్ బాపూరావు కవిత పార్టీలో చేరారు. ఆదివారం నాడు తన అనుచరులతో కలిసి హైదరాబాద్ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో.. జాగృతి కండువా కప్పి కవిత తన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పందించిన కవిత.. రాష్ట్ర సాధన కోసం పని చేసిన నేతలంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న పార్టీలను వదిలేసి.. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఎదగనున్న జాగృతిలో చేరాలని విజ్ఞప్తి చేశారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్ కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానన్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ జాగృతి నుంచే రాథోడ్ బాపూరావు బీఆర్ఎస్‌లో చేరి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేసిన కవిత.. ఇప్పుడు తిరిగి జాగృతిలోకి వచ్చినట్లు తెలిపారు. తాను పెట్టనున్న కొత్త పార్టీలో చేరేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నేతలు వస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులంతా ఇప్పుడు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. కొత్త పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదరణ ఉంటుందని వెల్లడించారు. తెలంగాణకు కవిత ముఖ్యమంత్రి కావాలని రాథోడ్ బాపూరావు ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడానికి కవిత ఇచ్చిన ధైర్యమే కారణమని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీలో తన తర్వాత వచ్చిన వారు కూడా మంత్రులు అయ్యారని.. కానీ తాను 2 సార్లు గెలిచినా మూడోసారి టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినా తనకు సరైన ప్రాధాన్యత దక్కలేదని పేర్కొన్నారు. కొత్త పార్టీ పెట్టిన తర్వాత ఇచ్చోడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. మరోవైపు.. సిరిసిల్ల జిల్లా నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నేతలు జాగృతిలో చేరినట్లు కవిత తెలిపారు. మరోవైపు.. ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్ట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పీ మాజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్‌ను పెట్టలేదని.. దీంతో ఆదివాసీలు తామ మతాన్ని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేదని లింగయ్య దొర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని.. ఆదివాసీల కోసం జనగణనలో ప్రత్యేక కాలమ్ పెట్టాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. అదే సమయంలో భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో ఆదివాసీల భాష కోయతూర్‌ను చేర్చాలని కవిత డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న 12 కోట్ల మంది ఆదివాసీలు.. నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులు అని.. తమ కొత్త పార్టీలో ఆదివాసీల గౌరవాన్ని కాపాడుతామని హామీ ఇచ్చారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

\- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## ఎమ్ఎంటీఎస్ ఉచిత ప్రయాణం ఇంకా పరిశీలనే!



హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఎమ్ఎంటీఎస్ రైళ్లలో ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ అంశంపై సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ప్రచారంలో ఉందని, ప్రజలు వాటిని నమ్మవద్దని అధికారికంగా ఒక ప్రకటనలో కోరింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఏప్రిల్ 7న ఈ ప్రతిపాదనను దక్షిణ మధ్య రైల్వేకు పంపింది. దీనిపై స్పందించిన రైల్వే శాఖ, ఈ పథకం అమలుకు సంబంధించిన నిబంధనలు, షరతులతో కూడిన అవగాహన ఒప్పందం సమర్పించాలని కోరినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ, ఇతర అంశాల ఆధారంగా ఎమ్ఎంటీఎస్ సేవలు నడుస్తున్నాయని, ఈ ప్రతిపాదనను తదుపరి చర్యల కోసం రైల్వే బోర్డు ఆమోదానికి పంపాల్సి ఉంటుందని రైల్వే అధికారులు వివరించారు. ఎమ్ఎంటీఎస్ రైళ్ల సంఖ్య, సమయాలు, స్టేషన్లలో కల్పించాల్సిన సౌకర్యాలు వంటి అంశాలపై పూర్తి నిర్ణయాధికారం దక్షిణ మధ్య రైల్వేకే ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారమే ఈ సేవలు కొనసాగుతాయని పేర్కొంది. ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన పరిశీలన దశలోనే ఉందని, రైల్వే బోర్డు ఆమోదం తర్వాతే దీనిపై ఒక తుది నిర్ణయం వెలువడుతుందని ప్రభుత్వం తెలియజేసింది. అందువల్ల, ఈ విషయమై అధికారిక ప్రకటన వెలువడే వరకు వేచి చూడాలని, సామాజిక మాధ్యమాల్లోని అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'

### దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్
### వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
### 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు



హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలి: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పవన్ కల్యాణ్.. శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్.. "పవన్ కల్యాణ్ గారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను.

## విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణ

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో హైదరాబాద్ లోక్‌భవన్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రగ్స్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా వాటిని ప్రభుత్వం తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటుందని ఆయనకు హామీ ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## 'తెలంగాణ సత్తెమ్మ'కు కేటీఆర్ నివాళి

వేములవాడ, ఏప్రిల్ 19 (ఈవార్తలు): 'తెలంగాణ సత్తెమ్మ'కు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కన్నీటి నివాళులు అర్పించారు. సత్తెమ్మ కుటంబాన్ని ఓదార్చిన ఆయన.. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. తెలంగాణ ఉద్యమకారిణి, బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త అయిన సత్తెమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. కరీంనగర్ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



చెందింది. వేములవాడ నియోజకవర్గం అగ్రహారానికి చెందిన సత్తెమ్మ కేసీఆర్‌కు వీరాభిమాని. కేటీఆర్‌పై కూడా ఆమె ఎనలేని ప్రేమ, అభిమానం చూపించేవారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సత్తెమ్మ 2009 నుంచి కేటీఆర్ వెంటే నడిచింది. జిల్లాలో కేటీఆర్ పాల్గొన్న ప్రతి సభకు వచ్చి జై తెలంగాణ..జై కేసీఆర్.. జై కేటీఆర్ అంటూ నినాదాలు చేసి సభకు వచ్చిన వారిలో ఉత్సాహం నింపేది. సత్తెమ్మ గ్రామం మాధ్య మానేరులో ముంపునకు గురైంది. దాంతో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో డబుల్ బెడ్ రూం ఇచ్చి కేటీఆర్ అండగా నిలిచారు. అయితే.. కొడుకు మృతితో మనోవేదనకు గురైన సత్తెమ్మ అనారోగ్యం బారిన పడింది. కరీంనగర్‌లోని ఓ దవాఖానాలో ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సత్తెవ్వ ఇకలేరనే విషయం తెలియగానే.. బీఆర్ఎస్ నేతలు, ఉద్యమకారులు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో అంత్యక్రియలు నిర్వహించారు.గులాబీ పార్టీ అధినేతపై ఎనలేని అభిమానం చూపిన సత్తెమ్మ అంత్యక్రియల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఆమె కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం చెప్పిన ఆయన పాడె మోసి సత్తెమ్మకు నివాళులు అర్పించారు.



## మళ్లీ కేసీఆరే సీఎం: జీవన్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 19(ఈవార్తలు): కేసీఆర్ మరోసారి సీఎం అవుతారని, అది ప్రజాభీష్టమని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పే ర్కొన్నారు. రెండున్నరేండ్లలోనే కాంగ్రెస్ స ర్కార్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. 'రేవంత్‌రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావా లి' అన్న ఆలోచన ప్రజల్లో మొదలైందని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఒకటే మార్గమ ని స్పష్టంచేశారు. తెలంగాణ సాధించిన ఉద్యమకారుడు కేసీఆర్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని, సోమవారం జగిత్యాలలో జరిగే బహిరంగ సభతో కేసీఆర్ జైత్రయాత్ర మొదలవుతుందని చెప్పారు. కేసీఆర్‌తో ప్రయాణం కొత్త అనుభూతిని కలిగిస్తున్నదని పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్‌లో ఆదివారం సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా పక్కన పెట్టిందని మండిపడ్డారు. తెలంగాణకు కరువు వస్తే సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యుడవుతారని తేల్చిచెప్పారు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines – Rs.450 (for each extra line – Rs.90)

COLOUR: Price for 5 Lines – Rs.500 (for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com



ఆహ్వానం పలుకుతోంది..

నేటి ఈవార్తలు

సంచలనాత్మక కథనాలు, వాస్తవ సమాచారాన్ని అందిస్తూ ప్రధాన పత్రికలకు దీటుగా అతి తక్కువ కాలంలోనే తెలుగు పాఠకుల ఆదరాభిమానాలు సంపాదించిన 'ఈవార్తలు' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణవ్యాప్తంగా విలేకరులు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఆసక్తి కలిగినవారు బయోడేటాను 9440455811కు వాట్సాప్ contact@evarthalu.comకు మెయిల్ గానీ చేయవచ్చు.

# మల్యాలలో హిందూ జనజాతర

## హిందూ సమ్మేళనం విజయవంతం.. దారిపట్టిన కాషాయ జెండాలు.. భారీగా కదిలివచ్చిన పల్లె జనాలు



మల్యాల, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమనకి ముఖ్య అతిథిగా చిలుకూరు బాలాజీ శివాలయం ప్రధాన అర్చకుడు సురేశ్ ఆత్మరామ్ మహారాజ్, ప్రధాన వక్త బిరెల్లి సంతోష్ కుమార్ హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు పాల్గొని ధర్మ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సంకల్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువత, మహిళలు, ప్రజ ప్రతినిధులు పెద్దలు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూ ఐక్యతే సమాజ బలం అని తెలిపారు. కులాలను పక్కనపెట్టి హిందువులంతా ఒకటిగా నిలవాలని పిలుపునిచ్చారు. ధర్మం, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వెల్లడించారు. ఈ సందర్భంగా అంగడిబజార్ ప్రాంగణం జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. యువత పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటింది. నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ హిందూ సమ్మేళనం మల్యాల ప్రాంతంలో ఐక్యతకు నాంది పలికిందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ద్వారా హిందూ బంధువులకు అన్నప్రసాదం అందజేశారు. అంతకుముందు, పల్లెల నుంచి సభా ప్రాంగణానికి హిందువులను తీసుకొచ్చేందుకు పలువురు తమ సొంత ఖర్చుతో వాహనాలను ఏర్పాటు చేశారు. కొందరు ఉత్సవ నిర్వహణకు విరాళం అందజేశారు. మరికొందరు అన్నప్రసాదం కోసం తమ వంతు సాయం చేశారు.

- ఇంటింటా మంగళహారతులు..
- ఇంటి ముందు రంగవల్లులు..
- వీధివీధినా కాషాయ జెండాలు..
- రోడ్ల వెంబడి జై శ్రీరాం ఫ్లెక్సీలు..
- ఉత్సవానికి వెల్లువెత్తిన విరాళాలు..
- ముందుకొచ్చి దాతల అన్నదానాలు..
- జాతరను తలపించిన సమ్మేళనం..
- మల్యాలలో చాటిచెప్పిన ఐక్యతారాగం..



## కొండగట్టు, ధర్మపురిలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ పూజలు

మల్యాల, ధర్మపురి, ఏప్రిల్ 19 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి, ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా కొండగట్టులో, అనంతరం ధర్మపురిలో ఆయన పూజలు నిర్వహించారు. ఆలయాల్లో వీరికి దేవస్థాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శనం చేసుకున్నారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ధర్మపురి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శంకటాల శ్రీనివాస్ శేషవస్త్రం, ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు చిలుకముక్కు అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరు యువకులు

మెట్‌పల్లి, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముఠాను పోలీసులు బట్టబయలు చేశారు. వైఎస్సార్ అర్బన్ కాలనీలో గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, మెట్‌పల్లికి చెందిన మల్యాల చందు, కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన బాణాల రాజు గంజాయిని మెదక్ ప్రాంతం నుంచి తక్కువ ధరకు తెచ్చుకుని, చిన్న ప్యాకెట్లుగా మార్చి యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పక్కా సమాచారంతో ఎస్ఐ పి . కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించి సుమారు 140 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. గంజాయి వినియోగం, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరిస్తూ, యువత ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్.. 4 కేసులు నమోదు

గొల్లపల్లి, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవిందపల్లి చౌరస్తాలో ఆదివారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంనర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. స్థానిక ఎస్ఐ ఎం . కృష్ణసాగర్ రెడ్డి తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా వాహనాల పత్రాలు, భద్రతా నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే జైలు శిక్ష కూడా తప్పదన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# జగిత్యాల జైత్రయాత్ర తప్పుదోవ

## ప్రజా సమస్యలపై సింహాంలా రేవంత్.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, ఏప్రిల్ 19 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ జగిత్యాలలో నిర్వహిస్తున్న సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు జగిత్యాల వచ్చిన మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లు సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి అడ్లూరి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అడ్డగోలుగా, అక్రమంగా, అవినీతి ద్వారా డబ్బులు సంపాదించి జగిత్యాల జైత్రయాత్ర పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. 2018లో కొండగట్టు ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదంలో 60 మంది మరణిస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ బాధితులను పరామర్శించలేదని మంత్రి అడ్లూరి విమరి ంచారు. రెండు సంవత్సరాల నాలుగు నెలల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంపై బావ, బావ మరుదులు గుంట నక్కల్ల తయారై విషం కక్కుతున్నారన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా, రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏకవచనంతో సంభోదిస్తున్నారని మరో మారు రేవంత్ రెడ్డిని ఇలా సంబోధిస్తే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క ఇలాగే ప్రవర్తించారా అని మంత్రి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేసి కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని కేటీఆర్, హరీష్ రావులు ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అన్నారు. 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత కేటీఆర్, హరీష్ రావులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు వీరిని విశ్వసించడం లేదని మంత్రి అన్నారు.

## జగిత్యాల నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభం

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ



జగిత్యాల, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల బహిరంగ సభతో కాంగ్రెస్ పతనం ప్రారంభమవుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎల్ రమణతో కలిసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సభకు ప్రజలు భారీగా హాజరవుతారని తెలిసి కాంగ్రెస్ నాయకుల్లో వణుకు మొదలైందని, మంత్రులు, ఎమ్మెల్యేలు అసంబద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటివరకు రైతుభరోసా నిధులు ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు వాటిని ప్రకటించడం, మేడిగడ్డ ప్రాజెక్టును పట్టించుకోని ప్రభుత్వం అకస్మాత్తుగా పరిశీలనకు వెళ్లడం చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వ పునాదులు కదులుతున్నాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ సభపై విమర్శలు చేయడం కాంగ్రెస్ అసహనాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని, కేసీఆర్ సమక్షంలో ఆయన చేరిక జరుగుతుందని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని, జీవన్ రెడ్డి సహకారం లేకుండా ఆయన గెలిచే వారా అని ప్రశ్నించారు. ధర్మపురి అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగరరావు, మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ సభ ఫ్లెక్సీ చించిన అగంతకులు

### జగిత్యాలలో టెన్షన్ వాతావరణం.. ఫ్లెక్సీ చించడంపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేడు మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు సభ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మాజీ మంత్రి జీవన్రెడ్డి బిఆర్ఎస్లో చేరనుండటంతో ఆయన అనుచరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగడంతో పాత బస్టాండ్ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ ఘటనపై పోలీసులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకవచ్చారు.

## ఎమ్మార్పీఎస్ కార్యకర్తపై దాడి

### కఠిన చర్యలకు ఎంఈఎఫ్ డిమాండ్.. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

కాకినాడ, ఏప్రిల్ 19 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా యూ కొత్తపల్లి మండలంలో ఒక మీడియా సంస్థలో పని చేస్తున్న జర్నలిస్టు మోర్త రవిపై శుక్రవారం రాత్రి కొందరు దుండగులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని మాదిగ ఉద్యోగుల సమాఖ్యకొత్తపల్లి మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో గాయపడిన రవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కొత్తపల్లి మండలానికి చెందిన ఉద్యోగులు ఎస్సై జీ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



## తిరుపతిలో ప్రేమ విఫలమై విద్యార్థి ఆత్మహత్య

### ప్రేమించిన యువతికి పెళ్లి కావడంతో తీవ్ర మనస్తాపం

తిరుపతి, ఏప్రిల్ 19 (ఈవార్తలు): ఏపీలోని తిరుపతిలో విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువతికి మరొకరితో వివాహం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటరమణ లేఅవుట్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా గంగవరం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన జె. మహేంద్ర (20) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని వెంకటరమణ లేఅవుట్‌లో స్నేహితులతో కలిసి అద్దె గదిలో నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా తాను ప్రేమించిన యువతికి వారం క్రితం వేరే వ్యక్తితో వివాహం జరగడంతో మహేంద్ర తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో తన బాబాయ్‌కి, సోదరికి మొబైల్‌లో మెసేజ్‌లు పంపాడు. 'నన్ను క్షమించండి.. అమ్మంటే నాకు చాలా ఇష్టం. ఆమెను బాగా చూసుకోండి' అని ఆ సందేశంలో పేర్కొన్నాడు. ఆ తర్వాత తన గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. ఉదయం స్నేహితులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తిరుపతి వెస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# కోలుకుంటున్నా

## ప్రజల ఆదరణకు ధన్యవాదాలు

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం నాడు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. సర్జరీ విజయవంతమైన నేపథ్యంలో తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతో పాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ, తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దాం" అని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. దీనికి పవన్ స్పందిస్తూ, "నా ఆరోగ్యం, కోలుకోవడం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ. నేను క్రమంగా కోలుకుంటున్నాను. మీ ఆదరణకు కృతజ్ఞుడను" అని బదులిచ్చారు. వీరితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలం తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే విధుల్లో చేరతారని జనసేన వర్గాలు తెలిపాయి.



# ఏఐ గురు..
# ధీరజ్ అర్రంశెట్టి




**టెక్నాలజిస్టులకు మెంటార్‌షిప్.. విద్యార్థులకు ఏఐ మార్గదర్శిగా సేవలు**

## భారతీయుడిగా పదిమందికి దిక్సూచి

**(ఈవార్తలు - ప్రవాస విభాగం)**

మనిషిని మించి ప్రపంచాన్ని ఏలుతున్న సాధనం.. కృత్రిమ మేధస్సు. అలాంటి కృత్రిమ మేధస్సును చేతివేళ్లపై ఆడిస్తూ, 'ఏఐ గురు'గా మారారు ధీరజ్ అర్రంశెట్టి. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ, యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీ నుంచి ఎంఎస్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన ధీరజ్.. అమెరికాలో ఐబీఎం కంపెనీలో ఏఐ టెక్నికల్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్‌గా సేవలు అందిస్తున్నారు. జనరేటివ్ ఏఐ సొల్యూషన్స్ డిజైన్, అమలులో నాయకత్వం వహిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో దూసుకుపోతున్నారు. అనలిటిక్స్ ఆర్కిటెక్చర్లలో దాదాపు పదేళ్ల అనుభవం గడించిన ఈయన.. ఆర్ఏజీ– ఆధారిత వ్యవస్థలు నిర్మించడం, సంభాషణాత్మక సెర్చ్ ప్లాట్‌ఫామ్‌లను ఆర్కిటెక్ట్ చేయడం, ఎంటర్‌ప్రైజ్ స్థాయి జెన్ ఏఐ అప్లికేషన్ల అభివృద్ధి చేయడం, అధునాతన ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ట్యూనింగ్ ద్వారా ఫౌండేషనల్ మోడల్ పనితీరును ఆప్టిమైజ్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. సీనియర్ ఐఈఈఈ మెంబర్‌గా సాంకేతిక రంగంలో చురుకైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏడీపీ లిస్ట్, ఆస్టిన్ కోడ్2 కాలేజ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, జూనియర్లు, టెక్నాలజిస్టులకు మార్గదర్శిగా ఉంటున్నారు. ముఖ్యంగా ఈయన అనేక ఏఐ, ఎంఎల్ పేటెంట్లను కలిగి, కంప్యూటర్ సైన్స్‌లో గొప్ప ప్రతిభను గడించారు. తనకు తెలిసిన ఏఐ విద్యను పదిమందికి బోధిస్తూ విజ్ఞానాన్ని పంచుకుంటున్నారు.

ప్రిడిక్టివ్ మోడలింగ్, బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన ధీరజ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. వ్యాపార ప్రక్రియలను ఆటోమేట్ చేసేందుకు, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌ను పెంచే దిశగా వాట్సన్‌ఎక్స్ ప్లాట్‌ఫాంను ఉపయోగించి, జెన్‌ఏఐ వ్యవస్థను అభివృద్ధి చేశారు. డిజిటల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ప్రాసెసింగ్ వేగాన్ని 10 రెట్లు పెంచే ఏఐ అప్లికేషన్‌ను రూపొందించారు. అది ఏఐ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది. ఇక, 200 కంటే ఎక్కువ పత్రాల నుంచి సమాధానాలను వెతికే డైనమిక్ సిస్టంను అభివృద్ధి చేసి, సంచలనం నమోదు చేశారు. అంతేకాదు.. డేటా సైంటిస్టుల ఉత్పాదకతను పెంచే ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేశారు. స్పార్క్, హైవ్ వంటి వంటి సాంకేతికతలను ఉపయోగించి భారీ డేటాను ప్రాసెస్ చేశారు. ఇది కృత్రిమ మేధస్సు విప్లవంలో మరో ఒరవడి. ఇలా తన మేధస్సుతో కృత్రిమ మేధస్సుకు కొత్త దారులు చూపిస్తూ భావి టెక్నాలజిస్టులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. భారతీయులకు గర్వకారణం అవుతున్నారు.

**ధీరజ్ పేటెంట్లు:**

**డేటా సెట్ ఎంపిక, ఎల్ఎల్ఎం వాటర్‌మార్కింగ్, ఏజెంట్ ఫ్రేమ్‌వర్క్‌లపై అనేక పేటెంట్లు కలిగి ఉన్నారు**

**డేటా సైన్స్, ఏఐ విభాగంలో టాప్ 10 ఏడీపీలిస్ట్ మెంటార్‌గా గుర్తింపు పొందారు.**

## పూర్తి బలంతో విరుచుకుపడతాం

టెహ్రాన్: తమపై దాడికి ప్రయత్నిస్తే అది శత్రువుల జీవితంలో అతిపెద్ద తప్పు అవుతుందని అమెరికాను ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, పూర్తి బలంతో విరుచుకుపడతామని ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ముందుగా ఎవరిపైనా దాడి చేయబోమని, కానీ తమ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే మాత్రం ప్రతిస్పందన ఊహకు అందదని తేల్చిచెప్పారు. ఇప్పటికే కీలక ప్రాంతాల్లో క్షిపణి వ్యవస్థలను మోహరించినట్లు ఇరాన్ వెల్లడించింది. కొంతకాలంగా ఇరాన్ అణు కార్యక్రమాలు, రక్షణ ఒప్పందాలపై అమెరికా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. దీనికి తోడు పశ్చిమాసియాలోని కీలక జలసంధుల్లో అమెరికా నౌకాదళం గస్తీ పెంచడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. దీనికి ప్రతిగా ఇరాన్ తన సైనిక శక్తిని ప్రదర్శిస్తూ, అత్యాధునిక డ్రోన్లు, సుదూర క్షిపణులను ప్రదర్శనకు ఉంచింది. ఇరాన్ హెచ్చరికలతో ప్రపంచ దేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్న పొరపాటు జరిగినా అది పెద్ద యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐక్యరాజ్యసమితి శాంతియుత పరిష్కారానికి పిలుపునిస్తున్నప్పటికీ, ఇరు దేశాలు వెనక్కి తగ్గడం లేదు.

## నేడు మరో విడత చర్చలు

**ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే**
**ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు**

ఇస్లామాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు మరోసారి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను నాశనం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చర్చల కోసం రేపు (ఏప్రిల్ 20న) అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్లనుందని వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "మేం చాలా న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాం. దానికి వారు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం. ఒకవేళ ఒప్పుకోకపోతే, ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను అమెరికా కూల్చేస్తుంది. ఇకపై మంచిగా వ్యవహరించేది లేదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ హంతక యంత్రాంగాన్ని అంతం చేసే సమయం వచ్చిందని, గత 47 ఏళ్లుగా ఇతర అధ్యక్షులు చేయలేని పనిని తాను చేస్తానని అన్నారు. గతంలో ఏప్రిల్ 11న ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేయగా, తమపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ కోరింది. ఆ చర్చలు విఫలమవ్వడంతో హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికాదళ దిగ్బంధనం విధించగా, దానికి ప్రతిగా ఇరాన్ ఆ జలసంధిని మూసివేసింది. కాగా, హర్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆదివారం ఆరోపించారు. ఫ్రాన్స్, బ్రిటన్‌కు చెందిన నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని తెలిపారు.

## అణు హక్కులు మా ఇష్టం

**ట్రంప్ పై ఇరాన్ అధ్యక్షుడు ఫైర్**

అమెరికాకు అధికారం లేదని స్పష్టం

టెహ్రాన్: ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ హక్కులను కాలరాయడానికి ట్రంప్ ఎవరు అని ఆయన సూటిగా ప్రశ్నించారు. "ఇరాన్ తన అణు హక్కులను ఉపయోగించకూడదని ట్రంప్ అంటున్నారు. కానీ ఏ నేరం కింద ఈ మాట చెబుతున్నారో వెల్లడించడం లేదు. ఒక దేశం హక్కులను లాక్కోవడానికి ఆయన ఎవరు?" అని పెజెష్కియాన్ నిలదీశారు. ఈ వ్యాఖ్యలను ఆదివారం ఇరానియన్ స్టూడెంట్ న్యూస్ ఏజెన్సీ ప్రచురించగా, రాయిటర్స్ వార్తా సంస్థ నివేదించింది. ఇరాన్ తన అణు సాంకేతికతను వినియోగించుకోకుండా అడ్డుకునేందుకు వాషింగ్టన్‌కు ఎలాంటి చట్టపరమైన హక్కు లేదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా చర్యలు ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని వాదించారు.

# రోబోలపై మనుషులు ఓడిపోయారు!

**హాఫ్ మారథాన్‌లో చైనా రోబోల సంచలనం**

బీజింగ్: రోబోటిక్స్ టెక్నాలజీలో చైనా సరికొత్త సంచలనం సృష్టించింది. బీజింగ్‌లో జరిగిన ఓ హాఫ్ మారథాన్‌లో హ్యూమనాయిడ్ రోబోలు మానవ అథ్లెట్లను మించిన వేగంతో పరుగెత్తి, ఏకంగా ప్రపంచ రికార్డును సైతం బద్దలు కొట్టాయి. ఈ అద్భుత ప్రదర్శన, రోబో సాంకేతికతలో జరుగుతున్న వేగవంతమైన పురోగతికి నిదర్శనంగా నిలిచింది. బీజింగ్ ఈ–టౌన్ వేదికగా జరిగిన ఈ హాఫ్ మారథాన్ రెండో ఎడిషన్‌లో 12,000 మంది మానవ రన్నర్లతో పాటు చైనాలో తయారైన వందలాది హ్యూమనాయిడ్ రోబోలు పోటీపడ్డాయి. భద్రతా కారణాల రీత్యా మనుషులు, రోబోలకు వేర్వేరు ట్రాక్‌లపై ఈ 21 కిలోమీటర్ల రేసును నిర్వహించారు. గతేడాది జరిగిన మొదటి ఈవెంట్‌లో చాలా రోబోలు కనీసం రేసును పూర్తి చేయలేకపోయాయి. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 100కి పైగా రోబో బృందాలు పాల్గొనగా, వాటిలో సగానికి పైగా ఎలాంటి రిమోట్ కంట్రోల్ సాయం లేకుండానే స్వయంప్రతిపత్తంగా గమ్యాన్ని చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి. ఈ ఏడాది విజేతగా నిలిచిన హానర్ కంపెనీకి చెందిన 'లైట్నింగ్' అనే రోబో కేవలం 50 నిమిషాల 26 సెకన్లలోనే రేసును పూర్తి చేసింది. ఇది ఇటీవలి మానవ హాఫ్ మారథాన్ వరల్డ్ రికార్డు కంటే చాలా తక్కువ సమయం కావడం విశేషం. అంతేకాకుండా, తొలి మూడు స్థానాలను కూడా హానర్ కంపెనీకి చెందిన రోబోలే కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని చాటాయి. వేగంగా పరుగెత్తించడం ద్వారా రోబోల సామర్థ్యాన్ని, వాటిలోని కూలింగ్ సిస్టమ్స్‌ను పరీక్షించవచ్చని, ఈ సాంకేతికత భవిష్యత్తులో ఇతర పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడుతుందని హానర్ కంపెనీ ఇంజనీర్ డు షియావోడి తెలిపారు. చైనా ప్రభుత్వం రోబోటిక్స్ రంగానికి సబ్సిడీలు, మౌలిక సదుపాయాలతో భారీ ప్రోత్సాహం అందిస్తోంది. తయారీ, ప్రమాదకరమైన పనులు, రక్షణ రంగాల్లో రోబోలు విప్లవాత్మక మార్పులు తీసుకురాగలవని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి హ్యూమనాయిడ్ రోబోలు ఇంకా వాణిజ్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానప్పటికీ, ఈ రేసులో కనబరిచిన పురోగతి భవిష్యత్తులో రోబోలు మన జీవితాల్లో ఎంతటి కీలక పాత్ర పోషించబోతున్నాయో స్పష్టంగా సూచిస్తోంది.



# ఎడప్పాడిలో స్వతంత్ర అభ్యర్థికి విజయ్ మద్దతు

**గతంలో టీవీకే అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ**

ఎడప్పాడి: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ సేలం జిల్లాలోని ఎడప్పాడి నియోజకవర్గంలో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎడప్పాడి నుంచి పోటీ చేసేందుకు టీవీకే తరఫున దాఖలైన నామినేషన్‌ను అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. ఈ పరిణామంతో పార్టీ శ్రేణులు నిరాశలో ఉన్న తరుణంలో అధ్యక్షుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇదే నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమ్‌కుమార్‌కు పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ప్రేమ్‌కుమార్ తన చిరకాల మిత్రుడని, అభిమాన సంఘం మాజీ నిర్వాహకుడని, సోదర సమానుడని విజయ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ్‌కుమార్‌కు అండగా నిలవాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఎడప్పాడిలోని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు ప్రేమ్‌కుమార్‌కు కేటాయించిన 'టెలివిజన్ సెట్' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్‌లోని గుర్తును, దాని సీరియల్ నంబర్‌ను గుర్తించి ఓటు వేయాలని కోరారు. "మన అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైనప్పటికీ, ప్రేమ్‌కుమార్‌ను మన ప్రతినిధిగానే భావిస్తున్నాం. ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని విజయ్ తన సందేశంలో పేర్కొన్నారు. పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్న వారికి ప్రేమ్‌కుమార్ గెలుపు ఒక గుణపాఠం అవుతుందని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏఐఏడీఎంకే సీనియర్ నేత ఎడప్పాడి కె. పళనిస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో టీవీకే మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి కారణంగా పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.



## ఇరాన్‌తో మునీర్ రహస్య ఒప్పందాలు?

**అమెరికాకు పాక్ ఆర్మీ చీఫ్ ఝలక్.. యూఎస్ ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక**

టెహ్రాన్: పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ అసిమ్ మునీర్ వైఖరి అమెరికాలో తీవ్ర కలకలం రేపుతోంది. ఇరాన్‌తో ఆయనకున్న పాత సంబంధాలు, ప్రస్తుత సైనిక ఒప్పందాలపై అమెరికా నిఘా వర్గాలు విడుదల చేసిన ఒక నివేదిక సంచలనంగా మారింది. పాక్ ఆర్మీ చీఫ్‌గా మునీర్ తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికా ప్రయోజనాలకు గండి కొట్టేలా ఉన్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్.. అమెరికా లేదా సౌదీ అరేబియా సాయం కోసం ఎదురుచూడకుండా ఇరాన్ వైపు మొగ్గు చూపడం వెనుక మునీర్ వ్యూహం ఉందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ఇరాన్‌కు చెందిన అత్యాధునిక డ్రోన్లు, షహెద్ క్షిపణి వ్యవస్థలను పాక్ సైన్యంలోకి చేర్చుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో టెహ్రాన్‌లో పాక్ డిఫెన్స్ అటాచీగా పనిచేసినప్పటి నుంచే మునీర్‌కు ఇరాన్ సైనిక నాయకత్వంతో బలమైన సంబంధాలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఈ పరిణామాలు వాషింగ్టన్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పేరుతో అమెరికా ఏటా పాకిస్థాన్‌కు భారీగా నిధులు అందిస్తోంది. ఇప్పుడు మునీర్ చర్యల వల్ల ఆ నిధులు పరోక్షంగా అమెరికా వ్యతిరేక దేశమైన ఇరాన్‌కు లేదా ఆ దేశ మద్దతున్న ఉగ్రసంస్థలకు చేరే ప్రమాదం ఉందని భయపడుతోంది. తన పాత పరిచయాలతో మునీర్ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తో రహస్య సమావేశాలు జరుపుతున్నారని, దీనివల్ల పాక్ అణు రహస్యాలు ఇరాన్‌కు చేరే ప్రమాదం కూడా ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద, జనరల్ మునీర్ వైఖరి పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా మరింత ఒంటరిని చేసే అవకాశం ఉందని, ఆయనపై అమెరికా కఠిన ఆంక్షలు విధించవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సౌదీని కాదని ఇరాన్‌కు ప్రాధాన్యం ఇవ్వడం గల్ఫ్ దేశాలతో పాక్ సంబంధాలను దెబ్బతీస్తుందని కూడా నివేదికలో పేర్కొన్నారు.

## అలీ ఖమేనీ అంత్యక్రియలు ఇంకెప్పుడు?

**నెల దాటినా ఖననం కాని ఇరాన్ మాజీ నేత మృతదేహం**

**స్వస్థలం మష్హద్‌లో ఖననం చేసేందుకు ప్రతిపాదనలు**

టెహ్రాన్: ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో మరణించి నెల రోజులు దాటినా, ఆయన మృతదేహానికి ఇంకా అంత్యక్రియలు జరగలేదు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల భయం, దేశంలో అంతర్గత నిరసనల ఆందోళనల నడుమ భారీ ఎత్తున బహిరంగ అంత్యక్రియలు నిర్వహించడానికి ఇరాన్ ప్రభుత్వం వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం దేశంలో నెలకొన్న తీవ్ర రాజకీయ అనిశ్చితికి, ప్రభుత్వ బలహీనతకు అద్దం పడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఖమేనీ (86) మరణించారు. మార్చి 4న అంత్యక్రియలు నిర్వహించాలని తొలుత ప్రణాళిక వేసినా, యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో వాయిదా వేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి తేదీని ప్రకటించలేదు. ప్రజలు లక్షలాదిగా తరలివస్తారన్న కారణంతో ఆలస్యమవుతోందని ప్రచారం జరుగుతున్నా, వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. గతంలో 1989లో అప్పటి సుప్రీంనేత ఖొమైనీ అంత్యక్రియలకు లక్షల మంది హాజరైనా, ఇప్పుడు అలాంటి వాతావరణం కనిపించడం లేదు. "ప్రస్తుత పాలనాయంత్రాంగం భయంతో, బలహీనంగా ఉంది. అందుకే పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించడానికి సాహసించడం లేదు" అని ఫౌండేషన్ ఫర్ డిఫెన్స్ ఆఫ్ డెమోక్రసీస్‌కు చెందిన బెహ్నామ్ తాలెబ్లు పేర్కొన్నారు. అంత్యక్రియల సమయంలో ఇజ్రాయెల్ దాడులు జరగవచ్చనే భయంతో పాటు, ఖమేనీ వారసుడిగా భావిస్తున్న ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించకపోవడం కూడా ఈ ఆలస్యానికి కారణమని ఆయన విశ్లేషించారు. ప్రస్తుతం ఇజ్రాయెల్‌కు దూరంగా, తుర్క్‌మెనిస్తాన్ సరిహద్దు సమీపంలో ఉన్న ఖమేనీ స్వస్థలం మష్హద్‌లో ఖననం చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.




## భారతీయ యాత్రికులకు పాక్ వీసా నిరాకరణ

**92 మందికి దాయాది సర్కారు మొండిచెయ్యి**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని పవిత్ర క్షేత్రాలను సందర్శించాలనుకున్న 92 మంది భారతీయులకు అక్కడి ప్రభుత్వం వీసాలు నిరాకరించింది. ఖల్సా సజ్నా దివస్ వేడుకల్లో భాగంగా గురుద్వారా పంజా సాహిబ్‌ను దర్శించుకునేందుకు వీరు సిద్ధమవగా, ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఖల్సా వాక్స్ న్యూస్ పోర్టల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ 92 మంది భక్తుల పేర్ల చివర "సింగ్" లేదా "కౌర్" లేనప్పటికీ, వీరంతా పది మంది సిక్కు గురువులపై ప్రగాఢ విశ్వాసం ఉన్నవారని ఖల్సా వాక్స్ కథనంలో సుదీప్ సింగ్ పేర్కొన్నారు. మొదట ఏప్రిల్ 10 నుంచి 19 వరకు వీరికి వీసాలు మంజూరు చేసిన పాకిస్థాన్, ఆ తర్వాత వాటిని రద్దు చేయడం భారతీయ కుటుంబాల మత విశ్వాసాలను దెబ్బతీసిందని ఆయన విమర్శించారు. హిందూ సమాజాన్ని గురుద్వారాల నుంచి దూరం చేసేందుకు పాకిస్థాన్ పన్నిన వ్యూహాత్మక చర్యగా ఇది కనిపిస్తోందని సుదీప్ సింగ్ ఆరోపించారు. హిందూ, సిక్కు కుటుంబాల మధ్య బంధాన్ని ఎవరూ విడదీయలేరని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు సిక్కుల పట్ల సానుభూతి నటిస్తూనే, మరోవైపు ఐఎస్ఐ ద్వారా భారత్‌లోకి డ్రగ్స్, ఆయుధాలు పంపిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. ఈ వీసాల రద్దు అంశాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ విదేశీ వ్యవహారాల సలహాదారు పరమ్‌జిత్ సింగ్ చందోక్ తెలిపినట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి విధానాల ద్వారా పాకిస్థాన్ ప్రభుత్వం గురుద్వారాలలోకి వీరి ప్రవేశాన్ని కూడా నిరోధించవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయని సుదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

## స్టాలిన్.. సూపర్ 6

**చెన్నైకి ప్రత్యేక మేనిఫెస్టో**




చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని 'చెన్నై సూపర్ 6' పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు. పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది. ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హై–ఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

వయ్యారి చిత్రం



మానుషి ఛిల్లార్



## వాల్మీకి రామాయణానికి ఇళయరాజా సంగీతం

భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్టాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. భావనా తల్వార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, వాల్మీకి మహర్షి రచించిన అసలు సిసలు రామాయణ ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించనుంది. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి ఇళయరాజా తన సంగీతంతో ప్రాణం పోయనున్నారు. విజువల్స్ మరియు సంగీతం పరంగా అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# వచ్చేస్తున్నాడు.. పరశురాముడు!


## హెంబాలే నుంచి పవర్ఫుల్ లుక్

ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ సినిమాలను నిర్మించే హెంబాలే ఫిలిమ్స్, ఇప్పుడు పురాణ గాథలను యానిమేషన్ రూపంలో వెండితెరపై మరింత పవర్ఫుల్ గా హైలెట్ చేసే పనిలో ఉంది. దశావతారాల నేపథ్యంతో ఒక భారీ యానిమేషన్ సినిమాటిక్ యూనివర్స్‌ను ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే 'మహావతార్ నరసింహ' చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే సిరీస్ లో రెండో భాగంగా విష్ణుమూర్తి ఆరో అవతారమైన పరశురాముడి కథను సిద్ధం చేస్తున్నారు. లేటెస్ట్ గా విడుదలైన 'మహావతార్ పరశురామ్' ఫస్ట్ లుక్ చూస్తుంటే, హెంబాలే సంస్థ యానిమేషన్ ప్రమాణాలను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు కనిపిస్తోంది. నరసింహ చిత్రాన్ని డైరెక్ట్ చేసిన అశ్విన్ కుమారే ఈ సినిమాకు కూడా దర్శకత్వం వహిస్తున్నారు. ఒక యానిమేషన్ సినిమా ద్వారా పురాణాల్లోని రౌద్రాన్ని, ఎమోషన్ ని పక్కాగా ప్రజెంట్ చేయడం అశ్విన్ స్టైల్. అందుకే పరశురాముడి అవతారాన్ని కూడా అంతే పవర్ఫుల్ గా డిజైన్ చేసినట్లు పోస్టర్ లో అర్థమవుతోంది. ధర్మ రక్షణ కోసం పరశు రాముడు పట్టుకున్న ఆ గొడ్డలి మీద రక్తం చిందినట్లు చూపించడం హైలెట్ అయ్యింది. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ లో క్లీమ్ ప్రొడక్షన్స్ కూడా పాట్నర్. దశావతారాల్లోని ప్రతి ఘట్టాన్ని విజువల్ వండర్ లా చూపించాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ యానిమేషన్ సిరీస్ లో మొత్తం ఏడు భాగాలు ఉంటాయని, అందులో పరశురామ్ కథ చాలా కీలకం కాబోతోందని సమాచారం. పౌరాణిక కథలను నేటి జనరేషన్ కి ఇంట్రెస్టింగ్ గా చెప్పాలంటే యానిమేషన్ ఒక మంచి దారి అని మేకర్స్ భావిస్తున్నారు. సామ్ సీఎస్ అందిస్తున్న బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు మరో మేజర్ హైలెట్ కానుందట. నరసింహ సినిమాలో విజువల్స్ కి మంచి గుర్తింపు రావడంతో, ఇప్పుడు పరశురామ్ మూవీ మీద అంచనాలు గట్టిగానే ఉన్నాయి. కేవలం చిన్న పిల్లల కోసమే కాకుండా, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా కథను నడిపించడంలో దర్శకుడు అశ్విన్ కుమార్ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ సినిమాలో వాడిన గ్రాఫిక్స్ గత భాగం కంటే ఇంకా మెరుగ్గా ఉండబోతున్నాయని టాక్. హెంబాలే ఫిలిమ్స్ లాంటి పెద్ద సంస్థ వెనుక ఉండటంతో మార్కెటింగ్ పరంగా కూడా ఈ యానిమేషన్ చిత్రం అన్ని భాషల్లో భారీగా రిలీజ్ కానుంది. 2027 డిసెంబర్ లో ఈ 'మహావతార్ పరశురామ్' బాక్సాఫీస్ వద్ద సందడి చేయబోతోంది. నరసింహ తర్వాత వస్తున్న ఈ రెండో పార్ట్ ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి. హెంబాలే సంస్థ ఇలాంటి ప్రయోగాత్మకమైన యానిమేషన్ చిత్రాలను ఎంకరేజ్ చేస్తూ ఇండస్ట్రీలో ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలుస్తోంది. పురాణాల్లోని యుద్ధ వీరుల కథలు యానిమేషన్ స్క్రీన్ మీద చూస్తుంటే వచ్చే కిక్కే వేరుగా ఉంటుంది. ఆ మ్యాజిక్ ని ఈ పరశురాముడు ఎంతవరకు రీక్రియేట్ చేస్తాడో వేచి చూడాలి.




## మళ్లీ తల్లి కాబోతున్న దీపికా పదుకొనే

బాలీవుడ్ క్యూట్ కపుల్ దీపికా పదుకొనే, రణవీర్ సింగ్ అభిమానులకు అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చారు. మొదటి బిడ్డ పుట్టిన కొద్ది కాలానికే ఈ స్టార్ జంట మళ్లీ తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన కూతురు ద్వారానే ఈ విషయాన్ని చాలా క్యూట్‌గా సోషల్ మీడియాలో పంచుకుంది దీపికా. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతోంది. దీపికా పదుకొనే తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గతేడాది సెప్టెంబర్‌లో జన్మించిన తన గారాల పట్టి దువా పదుకొనే సింగ్, ఒక ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్‌ను పట్టుకుని ఉన్న ఫోటోను దీపికా పోస్ట్ చేసింది. ఈ క్యూట్ ఫోటో చూస్తుంటే దువా త్వరలోనే 'పెద్దక్క' కాబోతోందని అర్థమైపోతోంది. ఇక ఎటువంటి పెద్ద పెద్ద డైలాగులు లేకుండా కేవలం ఒక ఫోటోతోనే తాను రెండోసారి గర్భం దాల్చిన విషయాన్ని దీపికా చాలా తెలివిగా, ముచ్చటగా చెప్పేసింది.






## సౌత్ పైనే జాన్వీ ఫోకస్!



అతిలోక సుందరి శ్రీదేవి తనయగా జాన్వీ కపూర్ దక్షిణాది చిత్ర పరిశ్రమలోకి భారీ అంచనాల మధ్య అడుగు పెట్టింది. యంగ్ ఎన్టీఆర్ సరసన -దేవర- సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన అమ్మడికి ఆ చిత్రం ఆశించిన స్థాయిలో మైలేజ్ ఇవ్వలేకపోయిందనేది వాస్తవం. సినిమాలో ఆమె స్క్రీన్ టైమ్ చాలా తక్కువగా ఉండటం, పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంతో జాన్వీ గ్లామర్ సాంగ్స్‌కే పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో తొలి ప్రయత్నంలోనే జాన్వీ తనకంటూ ఓ ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకోవడంలో కొంత తడబడింది. ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన -పెద్ది- చిత్రంలో జాన్వీ నటిస్తోంది. ఇంత గొప్ప ప్రాజెక్ట్‌లో అమ్మడు భాగమైనా ఇండస్ట్రీలో ఆమె పేరు అంతగా మారుమ్రోగడం లేదు. సాధారణంగా ఒక స్టార్ కిడ్ సినిమా చేస్తు న్నప్పుడు ఉండే హైప్ జాన్వీ విషయంలో ఎక్కడా కనిపించడం లేదు. అంతా స్తబ్దుగా ఉంది. షూటింగ్ పూర్తి చేసుకుని సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్నా జాన్వీ హడావుడి ఎక్కడా సోషల్ మీడియాలోనూ చర్చకు రాలేదు. ఈ సినిమా తర్వాత జాన్వీ ఏ హీరోతో నటిస్తోంది? అనే చర్చ ఎక్కడా జరగలేదు. కనీసం గాసిప్స్ కూడా తావు లేకుండా పోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో జాన్వీ కపూర్ ప్రాధాన్యతను పెంచుకునేందుకు కొత్త మార్గాలను వెతుకుతోందా? అనే చర్చ నెట్టింట మొదలైంది. దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యేందుకు జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవికి ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఓ బ్రహ్మాస్త్రం గా ప్రయోగిస్తుందని తెలుస్తోంది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తన తల్లికి దక్షిణాది సినిమాలంటే ఉన్న గౌరవాన్ని, తమిళ , తెలుగు ప్రేక్షకులు ఆమెను ఏ విధంగా ఆదరించారో పదే పదే గుర్తు చేస్తోంది. రెండు రాష్ట్రాల్లో ఉండే కొన్ని ప్రత్యేకమైన పాత్రాలను సైతం ప్రస్తావించింది. అలాగే మామ్ నటించిన ఎలాంటి చిత్రాలకు ఇక్కడ జనాలు ఎక్కువగా కనెక్ట్ అయ్యారు? వంటి అంశాల గురించి కూడా మాట్లాడినట్లు తెలుస్తోంది.

## జైలర్ 2 ఓటీటీ డీల్.. 160 కోట్లు?

సూపర్ స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద సృష్టించే ప్రభంజనం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు ఆయన నటిస్తున్న 'జైలర్ 2' విడుదలకు ముందే రికార్డులను తిరగరాస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా డిజిటల్ రైట్స్ కళ్లు చెదిరే ధరకు అమ్ముడయ్యాయట. గతంలో 'జైలర్' పార్ట్ 1 సాధించిన ఓటీటీ డీల్‌ను మించి, ఈ సీక్వెల్




ఏకంగా రూ. 160 కోట్లకు పైగా పలికినట్లు టాక్. కోలీవుడ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఒప్పందంగా నిలవనుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వస్తున్న 'జైలర్ 2' చుట్టూ ఇప్పుడు భారీ బిజినెస్ నడుస్తోంది. మొదటి భాగాన్ని రూ. 100 కోట్లకు కొనుగోలు చేసిన అమెజాన్ ప్రైమ్ వీడియో, ఇప్పుడు సీక్వెల్ కోసం ఏకంగా రూ. 160 కోట్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. ఇది కేవలం రజనీకాంత్ సినిమాకే సాధ్యమయ్యే మ్యాజిక్. గతంలో విజయ్ లియో, మణిరత్నం పొన్నియిన్ సెల్వన్ వంటి భారీ చిత్రాలు సాధించిన ఓటీటీ ధరలను కూడా 'జైలర్ 2' దాటేసి సరికొత్త రికార్డును సెట్ చేసింది.

## అనన్య నాగళ్ల ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ అందుకే..!



తెలుగు హీరోయిన్ అనన్య నాగళ్ల ఇన్ స్టాగ్రామ్ లో సబ్ స్క్రిప్షన్ ప్రారంభించడంతో, అదే తరహాలో గ్లామర్ కంటెంట్ షేర్ చేస్తుందనే ఊహాగానాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే, ఆ ప్రచారంలో నిజం లేదని స్పష్టమవుతోంది. అనన్య నాగళ్ల తన సబ్‌స్క్రైబర్ల కోసం గ్లామర్ ఫోటోలు కాకుండా.. ఎంతో ఉపయోగకరమైన కంటెంట్ అందిస్తోంది. యోగా, మెడిటేషన్, మెంటల్ హెల్త్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. హెల్తీ లైఫ్ స్టైల్ కు సంబంధించిన సూచనలు పంచుకుంటున్నారు. ఆమె వ్యక్తిగత అనుభవాలను కూడా ఫాలోవర్స్ తో షేర్ చేస్తూ, పీస్ ఫుల్ లైఫ్ స్టైల్ పై దృష్టి పెట్టిస్తోంది. ఇన్ స్టాగ్రామ్ సబ్ స్క్రిప్షన్ కోసం నెలకు సుమారు రూ.390 ఛార్జ్ విధించిన అనన్య.. దాని ద్వారా వచ్చిన డబ్బులు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. దీంతో ఆమెను ఫాలో అవుతున్న అభిమానులు మంచి స్పందన చూపిస్తున్నారు.







# బోణీకొట్టిన కేకేఆర్

## రాజస్థాన్‌పై విజయం.. గెలిపించిన రింకూ, అనుకుల్

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 6 | 5 | 0 | 11 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 |
| రాజస్థాన్ | 6 | 4 | 2 | 8 |
| హైదరాబాద్ | 6 | 3 | 3 | 6 |
| ఢిల్లీ | 5 | 3 | 2 | 6 |
| గుజరాత్ | 5 | 3 | 2 | 6 |
| చెన్నై | 6 | 2 | 4 | 4 |
| లక్నో | 6 | 2 | 4 | 4 |
| కోల్‌కతా | 7 | 1 | 5 | 3 |
| ముంబై | 5 | 1 | 4 | 2 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం జరిగిన రసవత్తర పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకూ పోరాడిన కేకేఆర్, ఓటమి అంచుల్లో నుంచి గెలిచి అభిమానులను ఉర్రూతలూగించింది.

'ఫినిషర్' రింకూ సింగ్(53) మరోసారి తన అసాధారణ పోరాటంతో జట్టును గెలిపించి హీరోగా నిలిచాడు. 156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే గట్టి షాకులు తగిలాయి. రాజస్థాన్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ధాటికి కేకేఆర్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది.




ఒక దశలో విజయం రాజస్థాన్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో రింకూ సింగ్ క్రీజులోకి వచ్చాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడిన రింకూ సింగ్, రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా చివరి ఓవర్లలో వరుస బౌండరీలతో సమీకరణాన్ని కోల్‌కతా వైపు తిప్పాడు. రింకూకు తోడుగా అనుకుల్ రాయ్(29) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కీలక సమయంలో సింగిల్స్ తీస్తూ, అవకాశం దొరికినప్పుడు బౌండరీలు కొడుతూ రింకూపై ఒత్తిడి పడకుండా చూశాడు. వీరిద్దరి మధ్య నెలకొన్న కీలక భాగస్వామ్యం కోల్‌కతాను గెలుపు తీరాలకు చేర్చింది. అంతకుముందు గ్రీన్ (27), పావెల్ (23) కూడా పర్వాలేదనిపించారు. సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో సాధించిన ఈ విజయం కేకేఆర్ శిబిరంలో ఉత్సాహాన్ని నింపింది. ఈ గెలుపుతో కోల్‌కతా ఐపీఎల్‌లో బోణి కొట్టింది. అసాధ్యమైన విజయాన్ని సుసాధ్యం చేసిన రింకూ సింగ్‌ను కేకేఆర్ యాజమాన్యం, ఆటగాళ్లు అభినందనలతో ముంచెత్తారు.


### మాటలు రావడం లేదు: రహానే

రాజస్థాన్‌పై విజయం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని కేకేఆర్ కెప్టెన్ రహానే అన్నాడు. రింకూ సింగ్, అనుకుల్ రాయ్‌ల వల్లే కేకేఆర్ గెలిచిందంటూ వారిపై ప్రశంసలు కురిపించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం రహానే మాట్లాడుతూ.. 'నాకు చాలా ఆనందంగా ఉంది. మంచి ఫీలింగ్ ఇది. ఈ మ్యాచ్‌లో చాలా భావోద్వేగాలు ఉన్నాయి. రింకు సింగ్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి ప్రదర్శనపై చాలా సంతోషంగా ఉంది. రింకు, అనుకుల్ ఇద్దరూ అద్భుత భాగస్వామ్యం నెలకొల్పారు. ఇద్దరి బ్యాటింగ్ సూపర్బ్. నాకు ఆటగాళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడటం ఇష్టం. పరిస్థితులను బాగా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ విజయం జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. బ్యాటింగ్ పరంగా ఇంకా మెరుగవ్వాల్సి ఉంది. కార్తీక్ త్యాగి అద్భుతంగా ఆడుతున్నాడు. తన సామర్థ్యం గురించి అతనికి స్పష్టత ఉంది. ఇలాంటి యువ ఆటగాడు జట్టులో ఉండటం గొప్ప విషయం. అతను ఆత్మవిశ్వాసం రోజురోజుకు పెరుగుతోంది. అది చూడటం చాలా ఆనందంగా ఉంది. త్యాగి బౌలింగ్ చేస్తున్న వేగం అద్భుతం. ప్రతి మ్యాచ్ నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉంటాయి. అదే క్రికెట్ అవగాహనను పెంచుతుంది. కొన్నిసార్లు స్ట్రైక్‌రేట్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని నాకు అనిపిస్తుంది. కానీ మ్యాచ్‌ను చివరివరకు తీసుకెళ్లడం ముఖ్యం. ఈరోజు ఏమి జరిగిందో మనం చూశాం. ఈ విజయం మాకు ఒక పెద్ద ఉపశమనం లాంటిది. జట్టు ఇంకా నేర్చుకోవాల్సిన విషయాలు ఉన్నాయి. ప్రతి మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకోవడం అవసరం. జట్టు సభ్యుల మధ్య స్పష్టమైన కమ్యూనికేషన్ ఉండాలి. అందరూ కలిసి కృషి చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం అద్భుతంగా ఉంది. అభిమానులు కూడా బాగా మద్దతు ఇచ్చారు. ఈ విజయం వాళ్లకే అంకితం. జట్టులో చాలా సానుకూల వాతావరణం ఉంది' అని రహానే చెప్పుకొచ్చాడు.

# ప్రియాన్ష్, కూపర్ కొట్టుడే కొట్టుడు

### లక్నోపై పంజాబ్ భారీ గెలుపు

ఐపీఎల్ 19లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఎదురైన ప్రత్యర్థినల్లా మట్టికరిపిస్తున్న శ్రేయస్ అయ్యర్ సేన ఈసారి లక్నో సూపర్ జెయింట్స్‌కు తమ పంచ్‌ను రుచిచూపింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నొల్లీ(87)ల విధ్వంసకాండతో 254 రన్స్ కొట్టిన పంజాబ్ ఆపై లక్నోను వణికించింది. ఆరంభం నుంచి తడబడిన లక్నో మర్క్‌రమ్(42) పోరాటంతో రన్స్‌కు పరిమితమైంది. పంజాబ్ ఖాతాలో ఐదో విజయం చేరగా.. పంత్ బృందానికి నాలుగో ఓటమి ఎదురైంది. ముల్లన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ పంజాకు లక్నో సూపర్ జెయింట్స్ విలవిలలాడింది. ఆదివారం డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ దెబ్బకు లక్నో బదులివ్వలేకపోయింది. బౌలర్ల వైఫల్యంతో భారీ స్కోర్ సమర్పించుకున్న లక్నో.. 255 పరుగుల ఛేదనలో ఏ కోశాన లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్‌గా వచ్చిన ఆయుశ్ బదొని(35) ఔట్ చేసి లక్నోను ఒత్తిడిలో పడేశాడు. విధ్వంసక హిట్టరైన




మిచెల్ మార్ష్(40), రిషభ్ పంత్(43)లు రాణించినా పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. హిట్టర్ పూరన్(9) విఫలమవ్వగా.. ఎడెన్ మర్క్‌రమ్(42), ముకుల్ చౌదరీ(21 నాటౌట్)లు పోరాడారు. కానీ, రన్‌రేటు అంతకంతకూ పెరిగిపోవడంతో వీరేమీ చేయలేకపోయాడు. లక్నో రెండొందలకే పరిమితవ్వగా పంజాబ్ 54 పరుగుల తేడాతో గెలుపొంది అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఐపీఎల్‌లో రికార్డుల మోతకు తెరదీసింది పంజాబ్ కింగ్స్. టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఆ జట్టు ముల్లన్‌పూర్‌లో భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జెయింట్స్‌ను భయపెట్టింది. టాస్ ఓడినా పంజాబ్‌కు శుభారంభం దక్కకున్న.. కుర్రాళ్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(0)ను తొలి ఓవర్లోనే ఔటైనా.. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లకు ప్రియాన్ష్ ఆర్య(93) చుక్కలు చూపించాడు. కూపర్ కొన్నొల్లీ(87) తో కలిసి విధ్వంసకాండ రచించిన ఈ కుర్రాడు మెరుపు అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకి లేదా బౌండరీ గీత దాటించడమే లక్ష్యంగా వీరిద్దరూ చెలరేగారు. ఇద్దరూ పోటాపోటీగా బౌండరీలు బాదేయగా పంజాబ్ స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు తీసింది. శతకాల దిశగా దూసుకెళ్లిన ఈ జోడీని ప్రిన్స్ యాదవ్(2-25) విడదీసి లక్నోకు ఊరటనిచ్చాడు. ఆ వెంటనే ప్రియాన్ష్‌ను సిద్దార్థ్(2-35) ఔట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(5) నిరాశపరిచాడు. అనంతరం నేహల్ వధేరా(13), మార్కస్ స్టోయినిస్(29), శశాంక్ సింగ్(17)లు స్కోర్ బోర్డును ఉరికించారు. ఆఖరి ఓవర్లో చివరి బంతికి స్టోయినిస్ రనౌటవ్వగా పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది.

# టీ20 కెప్టెన్‌గా అయ్యర్!

### త్వరలోనే ప్రకటించే చాన్స్.. సూర్యకు మొండిచేయి?




ఐపీఎల్‌లో అదరగొడుతున్న శ్రేయస్ అయ్యర్ కు బంపర్ ఆఫర్ తగిలినట్లు తెలుస్తోంది. భారత జట్టు టీ20 కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ ను నియామకం చేసేందుకు రంగం సిద్ధమైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీ20 కెప్టెన్ గా ఉన్న సూర్య కుమార్ యాదవ్ ను తొలగించి, అతి త్వరలోనే శ్రేయస్ అయ్యర్ పేరును ఫైనల్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ టోర్నమెంటులో శ్రేయస్ అయ్యర్ నాయకత్వం పట్ల సానుకూలతో ఉంది బీసీసీఐ. ఇటు టీ20 క్రికెట్ లో నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బాగా సెట్ అవుతాడు. నాలుగు స్థానంలో సరైన ప్లేయర్ లేక భారత జట్టు చాలా రోజులుగా సతమతమవుతోంది. దీంతో అతన్ని కెప్టెన్ గా నియామకం చేసి, జట్టులోకి తీసుకునేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుందట. టీ20 కెప్టెన్ గా రిషబ్ పంత్, శుభమాన్ గిల్ ఇద్దరు పోటీలో ఉన్నప్పటికీ అయ్యర్ వైపు బీసీసీఐ పెద్దలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు వరుసగా టీ20 సిరీస్ లు గెలుస్తోంది. కానీ సూర్యకుమార్ వ్యక్తిగత పర్ఫామెన్స్ మాత్రం చాలా చెత్తగా ఉంది.




# 2027 వరల్డ్ కప్ వరకూ అగార్కరే!: బీసీసీఐ

బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ ఏడాది జూన్‌తో ముగియనుంది. అయితే, అతని విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. సీనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అతన్ని కొనసాగించాలని చూస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అతని పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగించే అవకాశాలు ఉన్నాయని తెలిపాయి. అదే జరిగితే అతను వచ్చే ఏడాది జూన్ వరకు అతను చీఫ్ సెలెక్టర్‌గా కొనసాగుతాడు. 'అగార్కర్ హయాంలో జట్టు పరివర్తన చెందింది. అలాగే, అతను సాహసోపేత నిర్ణయాలను నిర్భయంగా తీసుకున్నాడు. అతన్ని కొనసాగించాలని బోర్డు భావిస్తుంది. ఐపీఎల్ సమయంలో బీసీసీఐ అధికారులు అతనితో మాట్లాడుతారు.'అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. 2023లో అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా పగ్గాలు చేపట్టాడు. అతని హయాంలో భారత జట్టు అద్భుత విజయాలు అందుకుంది. 2024, 2026లలో వరుసగా టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. 2025లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. 2023 వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలోనే 2027 వన్డే వరల్డ్ కప్ వరకు అతని సేవలను వినియోగించుకోవాలని బీసీసీఐ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# సీఎస్కే ప్లేయర్ మాత్రే ఔట్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. వరుసగా ప్లేయర్లు గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ఎల్లిస్, మహేంద్ర సింగ్ ధోని, ఫాస్ట్ బౌలర్ ఖలీల్ ముగ్గురు కూడా గాయం బారిన పడ్డారు. లేటెస్ట్ గా ఈ జాబితాలో ఆయుష్ మాత్రే కూడా చేరినట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. సన్ రైజర్స్ హైదరాబాద్ తో మ్యాచ్ సందర్భంగా కండరాల గాయం బారిన పడ్డాడు ఆయుష్ మాత్రే. ఈ విషయాన్ని చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ కూడా వెల్లడించారు. ఆయుష్ మాత్రే తొడ కండరాలలో చీలిక వచ్చిందని వెల్లడించారు. త్వరలోనే అతనికి స్కానింగ్ కూడా చేస్తారని తెలిపారు. దురదృష్టవశాత్తు పరిస్థితి తీవ్రంగానే కనిపిస్తోందని వెల్లడించారు. దీంతో ఆయుష్ మాత్రే కొన్ని మ్యాచ్ లకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు.

# అభిషేక్.. ఫస్ట్ ప్లేయర్!

టీమిండియా విధ్వంసకర ఓపెనర్, సన్ రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ అభిషేక్ శర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తనదైన ఊచకోత బ్యాటింగ్‌తో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అంతేకాక ఎవరికి సాధ్యం కానీ కొన్ని అరుదైన రికార్డులను సైతం తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో ఫామ్ కోల్పోయిన ఈ పవర్ హిట్టర్, ఐపీఎల్‌లో తిరిగి ఫామ్ అందుకున్నాడు. శనివారం సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. టీ20 ఫార్మాట్‌లో 20 బంతుల్లోపే అత్యధిక సార్లు అర్ధ సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. అతడు ఆరు సార్లు 20 బంతుల్లోపే హాఫ్ సెంచరీలు చేశాడు. ఓవరాల్‌గా పొట్టి క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఆటగాడూ కనీసం ఐదు సార్లు కూడా 20 బంతుల్లోపు అర్ధ సెంచరీ చేయలేదు. ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా అభిషేక్ చరిత్రలో నిలిచాడు. ఈ రికార్డుతో పాటు అభిషేక్ ఖాతాలో మరో రికార్డు కూడా చేరింది. అతని టీ20 కెరీర్‌లో 15 అంతకంటే తక్కువ బంతుల్లో నాలుగు సార్లు అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. ఈ ఘనతను సాధించిన ఏకైక ఆటగాడు కూడా అభిషేక్ నిలిచాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 20-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# సరిహద్దులు దాటిన ఉగ్ర సంహారం

గత రెండేళ్లుగా పాకిస్థాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి వంటి నగరాల్లో భారత్ వెతుకుతున్న కరడుగట్టిన ఉగ్రవాదులు 'గుర్తుతెలియని వ్యక్తుల' చేతుల్లో హతమవుతున్నారు. ముంబై దాడుల (26/11) మాస్టర్ మైండ్స్ మొదలుకుని, కాశ్మీర్‌లో రక్తపాతం సృష్టించిన హిజ్బుల్ ముజాహిదీన్, లష్కర్-ఏ-తోయిబా కమాండర్ల వరకు వరుసగా ఈ జాబితాలో చేరుతున్నారు. నిన్నటి వరకు ఆశ్రయం ఇచ్చిన దేశమే నేడు వారి పాలిట స్మశానవాటికగా మారుతోందా అనే సందేహం కలుగుతోంది. విదేశీ మీడియా సంస్థలైన ది గార్డియన్ వంటివి, భారత నిఘా సంస్థ 'రా' ఈ లక్షిత దాడుల వెనుక ఉందని కథనాలను ప్రచురించాయి. పాకిస్థాన్ ప్రభుత్వం కూడా ఇది భారత్ సాగిస్తున్న 'విదేశీ గడ్డపై హత్యల' పరంపర అని ఆరోపిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఈ ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. విదేశీ గడ్డపై ఇలాంటి ఆపరేషన్లు చేయడం భారత ప్రభుత్వ విధానం కాదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. అధికారికంగా భారత్ ఈ దాడులను ఖండించినప్పటికీ, దేశీయంగా ఒక కొత్త ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. "శత్రువు ఇంట్లోకి దూరి కొడతాం" అనే ప్రస్తుత నాయకత్వ నినాదం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

2019 పుల్వామా దాడి తర్వాత చేపట్టిన బాలాకోట్ వైమానిక దాడులు, అంతకుముందు సర్జికల్ స్ట్రైక్స్ భారత్ రక్షణ వ్యూహంలో వచ్చిన మౌలిక మార్పును సూచిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం ఫిర్యాదులకే పరిమితమైన భారత్, ఇప్పుడు క్రియాశీలక రక్షణ వైపు అడుగులు వేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉగ్రవాదులు ఎవరో ఒకరి చేతుల్లో హతమవడం అంతర్జాతీయ ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి మేలు చేసేదే. ఈ వరుస హత్యలు పాకిస్థాన్ తన గడ్డపై ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తోందనే వాస్తవాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాయి. ఆరోపణలు ఎలా ఉన్నా, భారత పౌరుల ప్రాణాలు తీసిన వారు ఏ మూల ఉన్నా సురక్షితం కాదనే గట్టి సందేశం మాత్రం ఈ పరిణామాల ద్వారా స్పష్టమవుతోంది. ఇది మారుతున్న నవ భారత వ్యూహానికి నిదర్శనం.

# కురుక్షేత్రం.. ఎత్తుగడలు!



కురుక్షేత్రం యుద్ధానికి ముందస్తుగా సాగిన ఎత్తుగడలేమిటి? ఏమిటీ స్ట్రాటజీ.. కేవలం అయిదుగురు.. అదీ అడవుల్లో ఉన్నవాళ్లు.. ఎవరికీ తెలియకుండా అజ్ఞాతంలో ఏడాది పాటు దాక్కున్న వాళ్లు.. అటుపక్క వంద మంది వెనుక ఉన్న అపార మందీ మార్బలాన్ని అలవోకగా జయించేశారు. ఒక్కర్ని కూడా మిగల్చకుండా మట్టుబెట్టారు. ఒక భారీ సైనిక వ్యవస్థను ఒక చిన్న సైన్యం విచ్ఛిన్నం చేయగలగటంలోనే అసలైన ఎత్తుగడ దాగి ఉంది. అదే యుద్ధ నీతి. అదే గెలుపు మంత్రం. ఇవాళి రాజకీయ వ్యవస్థకూ మార్గదర్శనం చేస్తున్న ఈ మంత్రం ఏమిటి? మనకు అవసరం లేదేమో కానీ.. ఈ యుద్ధనీతిని గురించి అమెరికా వాడు మాత్రం తెగ ఆలోచిస్తున్నాడు.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 90521 16463

ఇవాళ మహాభారత యుద్ధం అగ్రరాజ్యం అమెరికాలో హాట్ టాపిక్ అయిపోయింది. ఒకరికి పది మంది వ్యాస మహాభారతాన్ని అదే పనిగా ముందేసుకుని తెగ పరిశోధనలు చేసేస్తున్నారు. ఒబామా సర్కారు ఇందుకు ఫండింగ్ కూడా చేస్తోందిట. కొంతకాలంగా ఆర్థికంగా అల్లాడిపోతున్న అమెరికా, హార్దికంగా ఏకాకిగా మారుతున్న అమెరికాకు ఇంటెలెక్చ్యువల్ వ్యూహం అవసరమైంది. ప్రపంచంపై ఆధిపత్యం కొనసాగటానికి రాజనీతి ఎలా ఉండాలి? పాండవులు కౌరవులను ఎలా జయించారు? యుద్ధంలో గెలిచేందుకు పాండవులు ఎలాంటి ఎత్తుగడలు వేశారు? ఒకరిపై ఒకరు ఎలాంటి పన్నాగాలు పన్నారు? గెలుపు కోసం అయిదుగురు అన్నదమ్ములు ఎలా పావులు కదిపారు? ఈ విషయాల్ని ఎలా ఛేదించాలి? అన్నవాటిపై రీసర్చ్ మొదలెట్టింది. ఇప్పుడంటే అమెరికా ఈ రకమైన పరిశోధనలకు శ్రీకారం చుట్టింది కానీ, భారత యుద్ధం జరిగింది మన దగ్గర కదా.. పాండవుల విన్నింగ్ స్ట్రాటజీ గురించి మనలో ఎంతమందికి అవగాహన ఉంది?

రామాయణ, భారతాలను నిందించటమే తప్పు, అందులో ఇప్పటికీ మనకు పనికొచ్చే విషయాలేమున్నాయని ఆలోచించిందెవరు కనుక? ఇదిగో ఇప్పుడు ప్రపంచ పోలీసు ఆలోచిస్తున్నాడు. ఇంతకీ ఈ విన్నింగ్ మంత్రమేమిటి? పాండవులది రాజనీతా.. కూటనీతా? మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం 3138లో జరిగింది. రెండు బలమైన శక్తుల బలం కంటే వ్యూహమే గెలిచింది. ఏ మధ్య జరిగిన యుద్ధం అది. ఈ యుద్ధంలో విధంగా చూసినా యుద్ధం జరిగే నాటికి కౌరవుల కంటే పాండవుల శక్తి, సంపదలు గడిచిపోయింది. అందులో చివరి సంవత్సరం వేషాలు మార్చుకుని అజ్ఞాతంలో ఉండాల్సి తక్కువ. పాండవులు పవర్ కోల్పోయి అడవుల పాలై అప్పటికే పదమూడు సంవత్సరాలు వచ్చింది. కౌరవులేమో అధికారాన్ని పూర్తి స్థాయిలో అనుభవిస్తున్నారు. అటు ఆర్థిక బలం, ఇటు అంగబలం పుష్కలంగా ఉన్నాయి. ఎత్తుకు పైఎత్తులు వేసి క్షణాల్లో శత్రువును చిత్తు చేయగల పవర్ఫుల్ మేజర్ జనరల్స్ చాలా మందే ఉన్నారు. అధికారంలో ఉంటే అందివచ్చే అవకాశాలకు కొదవ లేదు. అన్నింటికీ మించి ఫండింగ్ సమస్య ఎంతమాత్రం లేదు. పైగా దుర్యోధనుడి మిత్రుడు కర్ణుడు దేశమంతా తిరిగి యుద్ధాలు చేసి చాలా రాజ్యాలను జయించుకు వచ్చాడు.. ఆ రాజ్యాల బలాబలాలన్నీ కూడా కౌరవుల పక్షమయ్యాయి. చివరకు శ్రీకృష్ణుడి రాజ్యంలో ఆయన తప్ప మిగతా సైన్యం అంతా కూడా కౌరవుల వైపే నిలిచింది. పాండవులకు విద్యలన్నీ నేర్పిన గురువులే కౌరవుల పక్షాన నిలిచారు. పాండవులతో సమానమైన వీరులు కౌరవుల పక్షాన ఉన్నారు.. అయినా, కౌరవ సైన్యం ఓడిపోయింది. కౌరవులు మట్టి కరుచుకుపోయారు.

ఒక్కరంటే ఒక్కరు కూడా మిగలలేదు.. ఇంత దారుణంగా ఎలా ఓడిపోయారు.. పాండవులు ఎలా గెలువగలిగారు? ధర్మం గెలిచింది అనీ, అధర్మం ఓడిపోయిందనే మాటలు చెప్పుకోవటానికి బాగానే ఉంటాయి. కానీ, వాస్తవం వేరు.. యుద్ధంలో బలమైన ప్రత్యర్థిని జయించటం మాటలు కావు.. కేవలం ధర్మాన్ని ఆచరించటం వల్లనే గెలుపు సాధ్యమవుతుందనుకోవటం తప్పు.. యుద్ధం చేసేందుకు తగిన ఆర్థిక వనరులు, మానవ వనరులను సమకూర్చుకోవటం అంత తేలిక కాదు. ప్రత్యర్థిని వీక్ చేసి గెలుపును సాధించటం ఓ గొప్ప విద్య.. అదే యుద్ధనీతి. ఆ విద్య, ఆ నీతి పాండవులకు బాగా తెలుసు.. అదే వారిని విజయం వైపు నడిపించింది. చరిత్ర సృష్టించింది. యుద్ధంలో పాండవుల గెలుపు సులభం కాలేదు.. అడవుల్లో పన్నెండేళ్లు... ఏడాది పాటు అజ్ఞాతంలో ఉన్నారు. ఓ పక్క అధికారం లేదు.. ఆర్థిక వనరులు లేవు.. కేవలం మజిల్ పవర్తో గెలుపు సాధ్యం కాదని వారికి తెలుసు. తమ వీక్నెస్ను తెలుసుకుని దాన్ని అధిగమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అజ్ఞాతంలోకి వెళ్లటానికి ముందు నుంచే అయిదుగురు అన్నదమ్ములూ ఒక్కో అడుగు నెమ్మదిగా ముందుకు వేస్తూ వెళ్లారు.

అర్జునుడు పవర్ ఫుల్ ఆయుధాలను సమకూర్చటంపై దృష్టి పెట్టాడు.

అణ్వస్త్రం అని చరిత్రకారులు భావిస్తున్న పాశుపతాస్త్రాన్ని సంపాదించాడు.

బీముడు హనుమంతుడిని కలిసి గదావిద్యలో మరింత బలాన్ని సంపాదించాడు..

అటు గంధర్వుల దగ్గరకు వెళ్లి వారి మిత్రత్వాన్ని సంపాదించాడు.

ఇక ధర్మరాజేమో.. మిత్రపక్షాలపై దృష్టి పెట్టాడు. తన టార్గెట్ ఏమిటో ఆయన ముందే డిసైడ్ చేసుకున్నాడు. ఇటు కృష్ణుడితో, అటు ద్రౌపది తండ్రి ద్రుపదుడితో మంతనాలు జరుపుతూ భారత దేశమంతటా పవర్ఫుల్ మిత్ర పక్షాలను ఏర్పాటు చేసుకున్నాడు. అంతకంటే ముందు పాండవులు ద్రౌపది కాకుండా విడివిడిగా చేసుకున్న వివాహాల ద్వారా బలమైన ఆర్థిక శక్తులను కూడగట్టుకున్నారు. ధర్మరాజు, దేవికల వివాహంతో కేకయ రాజ్యం.. భీముడు, బలంధరల పెళ్లితో కాశీ.. అర్జునుడు సుభద్రల పెళ్లితో ద్వారక.. అర్జునుడు, ఉలూచిల పెళ్లితో నాగులు.. నకులుడు, కిరణ్మయిల పెళ్లితో చేది.. సహదేవుడు, విజయల వివాహంతో మగధ రాజ్యాలు దగ్గరయ్యాయి. వీరిలో నాగులు మాత్రం యుద్ధంలో పాల్గొనలేదు. పాండవులు అడవుల్లో ఉన్నా, కృష్ణుడు అవసరమైన సన్నాహాలన్నీ చేసిపెట్టాడు.. మిత్రులను సమకూర్చి ఉంచాడు.. సంధి రాయబారానికి వెళ్లి భీష్మ, ద్రోణులకు, కర్ణుడికి మధ్య చిచ్చు పెట్టాడు.. దీని ద్వారా భీష్ముడు, కర్ణుడు ఒకేసారి యుద్ధరంగంలోకి దిగకుండా అడ్డుకట్ట వేయగలిగాడు. భీష్ముడు చనిపోయిన తరువాత కానీ, కర్ణుడు రంగంలోకి రాలేదు. యుద్ధ నాయకత్వం విషయంలోనూ చాలా స్ట్రాటెజిక్గా వ్యవహరించారు. మొత్తం బలగాలను డీసెంట్రలైజ్ చేశారు.. ఏడు ఆర్మీ డివిజన్ల (అక్షౌహిణులు)లో ఒక్కో డివిజన్కు ఒక్కో కమాండర్. అందరికీ కలిపి ఒక జనరల్. దీంతో వ్యూహాన్ని, ఎత్తుగడల్ని పంచుకోవటం కానీ, ఇంప్లిమెంట్ చేయటం కానీ చాలా సులువు అయిపోయింది. టీమ్ స్పిరిట్.. పాండవులకు పెద్ద బలం.. ఒకే టీమ్.. ఒకే మాటపై నడిచే సైన్యం. ఎవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవు . అందరిదీ ఒకే టార్గెట్.. కౌరవులను ఓడించటం.. ప్రతీకారం తీర్చుకోవటం.. అధికారాన్ని హస్తగతం చేసుకోవటం... అందరూ ఆ గోల్ కోసమే యుద్ధం చేశారు.. ఎలాగైనా గెలిచి తీరాలనే ముందుకు వెళ్లారు. కో ఆపరేషన్, కో ఆర్డినేషన్.. సహకారం, సమన్వయం.. ఈ రెండూ పాండవులకు పెద్ద బలం.. బలగం.

కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల గెలుపు వ్యూహం చాలా కీలకమైంది.. 18 రోజుల పాటు యుద్ధం జరిగిన తీరు గమనిస్తే.. ఆశ్చర్యం వేస్తుంది.. విస్మయం కలుగుతుంది. ఒక్కొక్కరినీ, ఒక్కో రకంగా, ఒక్కో ఎత్తుగడ వేసి హతమార్చిన వైనం పాండవుల, వారి జనరల్స్ యుద్ధనీతికి నిదర్శనం.. కౌరవుల దగ్గర ఈ వ్యూహమే లోపించింది. అంతా నిరంకుశంగా సాగిన రణతంత్రం వారిని పూర్తిగా దెబ్బతీసింది. కృష్ణుడు రాయబారానికి వెళ్లినప్పుడు దుర్యోధనుడు సంధికి ఒప్పుకోకపోవటానికి సరైన కారణమే ఉంది. కృష్ణుడికి జవాబు చెప్పడానికి ముందు దుర్యోధనుడు తన కోర్ టీంలోని దుశ్శాసన, కర్ణ, శకునిలతో సీరియస్ గానే చర్చించాడు. శత్రుబలాలను పూర్తిగా అంచనా వేసుకున్నారు. ఏ విధంగా చూసినా తమ దగ్గర ఉన్న వీరులు కానీ, ఆయుధ బలగాలు కానీ ఎక్కువ. తన శక్తిసంపదలపై అతి విశ్వాసం పెట్టుకున్నాడు. నిజంగా కూడా కౌరవుల తక్కువే. ఆ ధైర్యంతోనే యుద్ధానికి దుర్యోధనుడు వాస్తవ బలం ముందు పాండవుల బలం సై అన్నాడు.

పాండవులు అడవులకు వెళ్లగానే, ఇక తమకు ఎదురు లేదని కర్ణుణ్ణి ఇతర దేశాలపైకి మిలిటరీ మిషన్పై పంపించారు. అన్ని దేశాలను జయించి సామంతులను. సంపదను పెంచుకున్నట్లే శత్రువులనూ పెంచుకున్నారు. కనీసం అధికార వికేంద్రీకరణ అయినా ఉందా అంటే అదీ లేదు.. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఆ నలుగురే. సామంతులు కాకుండా తోడుగా నిలిచిన మిత్రపక్షాలు శకునికి చెందిన గాంధార... అంటే ఇవాళి కాందహార్, సైంధవుడికి చెందిన సింధు, భగదత్తుడికి చెందిన కంబోడియా అంటే కాంభోజులు మాత్రమే. యుద్ధం జరుగుతున్నప్పుడు సైతం 11 ఆర్మీ వింగ్స్ ఉన్నా, నాయకత్వం ఒకరి చేతుల్లోనే ఉండిపోయింది. దీంతో సైనికులు, సైన్య విభాగాల మధ్య కమ్యునికేషన్ గ్యాప్ చాలా పెరిగిపోయింది. పైగా ఎవరికి వారు వాళ్ల వాళ్ల ప్రయోజనాల కోసమో, ఎప్పుడో చేసిన కమిట్మెంట్ల కోసమో యుద్ధం చేశారే తప్ప, దుర్యోధనుణ్ణి గెలిపించేందుకు ఎవరూ ప్రయత్నించలేదు. కర్ణుడికి లైఫ్టైమ్ గోల్ అర్జునుణ్ణి గెలవటం, భీష్ముడికి అప్పుడెప్పుడో సింహాసనాన్ని కాపాడతానన్న తన ప్రతిజ్ఞ ప్రధానం.. ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో గోల్ కావటంతో టీమ్ స్పిరిట్ లేకుండా పోయింది. అంతే కాదు.. దుర్యోధనుడు, అతని నలుగురు కోర్ టీమ్కు తప్ప మిగతా వాళ్లెవరికీ యుద్ధం ఇష్టం లేదు. బలవంతంగానే రణరంగంలోకి వచ్చారు.. వీరిలో పెద్ద తలకాయలకు పాండవ పక్షపాతం. ఈ వీక్ నెస్ను పాండవులు చక్కగా వాడుకున్నారు. ఒక్కొక్కరిని వేరు చేసి విడివిడిగా హతమారుస్తూ వచ్చారు. పది రోజులు బీభత్సం సృష్టించిన భీష్ముడి వీక్ నెస్ శిఖండి.. అతణ్ణి ప్రయోగించి ఆయన్ను పక్కకు తప్పించారు. కొడుకే బలహీనత అయిన గురువు ద్రోణుణ్ణి చంపేందుకు ధర్మరాజు అబద్ధం అడేందుకు వెనుకాడలేదు. కర్ణుడికి సకల అవలక్షణాలు ఉన్నాయి. అవన్నీ రణరంగంలో అతనికి శాపాలుగా మారాయి. అతణ్ణి నిరాయుధుణ్ణి చేసి మరీ చంపారు. దీనికి తోడు పాండవుల కోవర్ట్ శల్యుడు.. ఇతను కర్ణుడి సారథి.. అతనికి ఇది పెద్ద దెబ్బ. అంతా ఒక్కటై నిలిస్తే పాండవులు గెలిచే వారే కారు.. అందుకే ఏకాకుల్ని చేసి మరీ అంతం చేశారు. ఈ వ్యూహాన్ని దుర్యోధనుడు అర్థం చేసుకునే సరికే తాను ఏకాకి అయిపోయాడు. అంతం అయ్యాడు.

మన బలహీనతల్ని బలంగా మార్చుకోవాలి. శత్రువులను మిత్రపక్షాలుగా మలచుకోవాలి. బాధ్యతలను అందరితో సమంగా పంచుకోవాలి. సరైన టీము ఎంచు కోవటం, టీమ్ స్పిరిట్తో నడుచు కోవటం ముఖ్యం. బలమైన నాయకత్వం చాలా అవసరం. టీమ్ మొత్తం ఒకే గోల్ కోసం స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి.. ప్రత్యర్థి శిబిరంలో బలహీనతల్ని సొమ్ము చేసుకోవటానికి వ్యూహాత్మకంగా పావులు కదపాలి. బలవంతులను ఐక్యంగా వుంచటం కంటే వీక్ చేసి శత్రు శిబిరాన్ని విచ్ఛిన్నం చేయాలి.. పాండవుల విజయ రహస్యం ఇదే.. ఆచితూచి పావులు కదిపి అధికారాన్ని హస్తగతం చేసుకున్న వీరులు. సొంత బలంపై అతి విశ్వాసానికి పోతే ఎలాంటి పరిణామాలు వుంటాయో 9/11 నాడు ఒసామా బిన్ లాడెన్ అమెరికాకు రుచి చూపించాడు. అందుకే ఇప్పుడు అమెరికాకు తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవటం అవసరమైంది. అమెరికా మాటెలా ఉన్నా, మనకు మన బలాన్ని, బలగాన్ని సెల్ఫ్ అసెస్ చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఎదగాలని కలలు కంటున్న పాలకులు ఒక్కసారి మహాభారత రాజనీతిని, కూటనీతిని, యుద్ధనీతిని జస్ట్ ఫాలో అయితే వాళ్ల కల నెరవేర్చుకోవటం పెద్ద కష్టం ఏమీ కాదు. మన భారతం మనం ఎలా ఉండాలో చెప్తోంది. మన రాజకీయ వ్యవస్థ ఎలా వుండాలో డైరెక్ట్ చేస్తోంది. ఎక్స్టెర్నల్ పాలసీనీ, ఎకనమిక్ పాలసీని సైతం ఓ రోల్మాడల్గా భారతం చెప్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే, భారతంలో అసలు కథ అన్నదమ్ముల గొడవే కానీ, దాని వెనుక ఉన్నది మాత్రం అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ జన జీవన విధానం.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.